తెలంగాణ

తెలుగు జాతీయ దినపత్రిక


# తెలుగు-వెలుగు

ప్రతిక్షణం ప్రజల పక్షం

సంపుటి :03, సంచిక :28 హైదరాబాద్: సంపాదకులు: గున్నాల అనిల్ రెడ్డి, బుధవారం జులై 23, 2025, పేజీలు -12, వెల -5/-

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur







### ధన్‌ఖర్ రాజీనామాకు

## రాష్ట్రపతి ఆమోదం

**- జగదీప్ ధన్‌ఖడ్ ఆయురారోగ్యాలతో ఉండాలని మోదీ ఆకాంక్ష**



**న్యూఢిల్లీ,జులై 22(తెలుగు - వెలుగు):** ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా సమర్పించగా.. మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దానికి ఆమోదం తెలిపారు. ఈ సమాచారాన్ని రాష్ట్రపతి కార్యాలయం హోంమంత్రిత్వ మిగతా2లో...

### రాష్ట్రపతి ముర్ముతో డిప్యూటి ఛైర్మన్

## హరివంశ్ భేటీ

**- మర్యాదపూర్వక భేటీ అంటూ ప్రకటన విడుదల**



**న్యూఢిల్లీ,జులై 22(తెలుగు - వెలుగు):** రాజ్యసభ డిప్యూటీ- ఛైర్మన్ హరివంశ్ మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. సోమవారం సాయంత్రం జగదీప్ ధన్‌ఖర్ ఉప రాష్ట్రపతిగా రాజీనామా చేయగా మంగళశార్ రాష్ట్రపతి దానిని ఆమోదించారు. ఈ నేపథ్యంలో హరివంశ్ రాష్ట్రపతిని కలువడం చర్చనీయాంశంగా మారింది. మిగతా2లో...

### రికార్డు స్థాయిలో మహిళల

## ఉచిత ప్రయాణం

**- ఆడబిడ్డలకు సిఎం శుభాకాంక్షలు**



**హైదరాబాద్,జులై 22(తెలుగు - వెలుగు):** ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి స్కీమ్ ప్రారంభించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని అమలు చేసింది. 18 నెలలుగా ఎలాంటి ఆటంకం లేకుండా విజయవంతంగా సాగుతోన్న మహాలక్ష్మి స్కీమ్ అరుదైన మైలురాయిని అందుకుంది. ఈ స్కీములో భాగంగా ఇప్పటి వరకు 200 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారు. మహాలక్ష్మి స్కీమ్ ఈ అరుదైన ఘనత అందుకోవడంపై సీఎం మిగతా2లో...



### అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

## పేదలకు చేరాలి

**ప్రభుత్వ లక్ష్యలు నెరవేరేలా కలెక్టర్లు కృషి చేయాలి**

**పథకాల ఫలితాలు అందేలా క్షేత్రస్థాయి చర్యలు**

**వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు మంత్రుల ఆదేశం**

**హైదరాబాద్,జులై 22(తెలుగు - వెలుగు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం ఉదయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు,కార్యదర్శులు, విభాగాధిపతులతో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై సమీక్ష చేశారు. రాష్ట్ర మంత్రులు వివిధ అంశాల వారీగా జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కలెక్టర్లు, అధికారులు నిర్విరామంగా కృషి చేయాలని తెలిపారు. మిగతా2లో...



## ఐటి మినహాయింపులో కాంగ్రెస్‌కు చుక్కెదురు

**- 199 కోట్లకు పన్ను చెల్లించాలని ట్రిబ్యునల్ ఆదేశం**

**న్యూఢిల్లీ,జులై 22(తెలుగు - వెలుగు):** పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన విజ్ఞప్తిని ఆదాయ పన్ను అప్పీలేట్ ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. రూ.199 కోట్ల విరాళాలపై ఆలస్యంగా రిటర్నులు దాఖలు చేయడం ఉల్లంఘన కిందకే వస్తుందని, చట్టప్రకారం మొత్తం మిగతా2లో...

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై

## వెనకడుగు లేదు

**ఎలాటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం**

**అవసరమైతే న్యాయపోరాటినికి కూడా వెనకాడం**

**కేంద్రం దీనిని వెంటనే ఆమోదించి చిత్తశుద్ది చాటాలి**

**రామచంద్రరావు లీగల్ నోటీసులకు జడిసేది లేదు**

**మీడియాతో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క**



**హైదరాబాద్,జులై 22(తెలుగు - వెలుగు):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై న్యాయపరమైన సమస్యలు వస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలంగాణ డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. కులగణన సర్వే ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. సచివాల యంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. బిసి రిజర్వేషన్ల లో వెనక్కి పోయే ప్రసక్తి లేదని మిగతా2లో...

## బీసీలను మోసం చేయడమే కాంగ్రెస్ అసలు వైఖరి

**- బీఆర్ఎస్ పార్టీ**



2లో

### మరో ఎయిరిండియా విమానానికి

## అగ్నిప్రమాదం

**ప్రయాణికులు, సిబ్బంది దిగాక మంటలు**

**అప్రమత్తం కావడంతో తప్పిన ముప్పు**




**న్యూఢిల్లీ,జులై 22(తెలుగు - వెలుగు):** ఎయిర్ ఇండియా ఫ్లయిట్.. ఈ మాట వింటే చాలు అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటన గుర్తుకొస్తుంది. అంతే కాదు ఇటీ-వల వరసగా జరుగుతున్న విమాన ప్రమాదాలు సైతం భయాన్ని పుట్టిస్తున్నాయి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఢిల్లీ ఎయిర్ పోర్టులో జరిగిన ఘటన అందర్నీ భయాందోళనలకు గురి చేసింది. పరుగులు పెట్టించింది. ఏఐ 317 నెంబర్ ఎయిర్ ఇండియా విమానం హాంగ్ కాంగ్ నుంచి ఢిల్లీకి వచ్చింది. సాయంత్రం 6 గంటల సమయంలో ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. విమానంలో ప్యాసింజర్లు కిందకు దిగారు. ఆ తర్వాత విమాన సిబ్బంది కూడా బయటకు వచ్చారు. మిగతా2లో...



## తెలంగాణ గరిమను చాటిన మహానుభావుడు దాశరథి: కెసిఆర్

**హైదరాబాద్,జులై 22(తెలుగు - వెలుగు):**నా తెలంగాణ కోటి రత నాల వీణ' ... అంటూ తెలంగాణ గరిమను, తన సాహిత్యం ద్వారా ప్రపంచానికి చాటిన గొప్ప తెలంగాణ కవి, దాశరథి కృష్ణమాచార్య అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. దాశరథి శత జయంతి సందర్భంగా వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. కవిగా, రచయితగా, తెలంగాణ అస్మితను, తన ప్రాంత ప్రజల కష్టాలను, ప్రపంచానికి వినిపించిన తెలంగాణ గర్వించదగ్గ భూమి పుత్రుడు దాశరథి అని కేసీఆర్ అన్నారు.

### బిల్లుల ఆమోదంలో రాష్ట్రపతికి

## నిర్దిష్ట గడువు విధింపు

**- సుప్రీం ధర్మాసనం విచారణ...కేంద్రానికి నోటీసులు**



**న్యూఢిల్లీ,జులై 22(తెలుగు - వెలుగు):** శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట గడువులోగా ఆమోదించాలంటూ కోర్టులు వారిని నిర్దేశించవచ్చా అనే అంశంపై మంగళవారం సుప్రీం కోర్టులో మిగతా2లో...

## తెలంగాణలో మూడ్రోజులు భారీ వర్షాలు

# ధన్‌ఖర్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

శాఖకు తెలియజేసింది. అలాగే దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. అనారోగ్య కారణాలతో ధన్‌ఖడ్ రాజీనామా చేస్తున్నాట్లుగా ప్రకటించారు. అయితే ఆయన రాజీనామాపై ఎలాంటి అనుమానాలు ప్రభుత్వం పక్షాన వ్యక్తం కాలేదు. సరికదా ఆయన ఆయురారోగ్యా లతో ఉండాలని కోరుకుంటున్నానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఉప రాష్ట్రపతి పదవితో సహా వివిధ హోదాల్లో ధన్‌ఖడ్ దేశానికి సేవలు అందించారని అన్నారు. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో పార్లమెంటు- వర్షాకాల సమావేశాల తొలిరోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ధన్‌ఖడ్.. రాత్రి కల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు- అందులో పేర్కొన్నారు. వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ)కు అనుగుణంగా నేను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నా. బాధ్యతల నిర్వహణలో నాకు అండగా నిలిచిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు. పదవీకాలంలో మేం చాలా ప్రశాంతమైన, అద్భుతమైన వర్కింగ్ రిలేషన్‌ను కొనసాగించాం. ప్రధాన మంత్రి, మంత్రి మండలికీ హృదయపూర్వక కృతజ్ఞతలు అని ధన్యవాదాలు చెప్పారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు. దేశ 14వ ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన సోమవారం సాయంత్రం వరకూ ఆరోగ్యంగా కనిపించినప్పటికీ రాత్రికి అదే కారణంతో రాజీనామా చేయడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ధన్‌ఖడ్ రాజీనామా ఊహించని పరిణామమని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఆరోగ్య అంశం కంటికి కనిపిస్తున్నా కనిపించనివి ఏవో దీనివెనక ఉండి ఉంటాయని అనుమానం వ్యక్తంచేసింది.

# రాష్ట్రపతి ముర్ముతో డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి భవన్ 'ఎక్స్' పోస్ట్‌లో భేటీకి సంబంధించిన చిత్రాన్ని షేర్ చేసింది. రాజ్యసభ డిప్యూటీ- ఛైర్మన్ హరివంశ్ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిసినట్లు- తెలిపింది. జగదీప్ ధన్‌ఖర్ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే పదవికి రాజీనామా చేసి అందరికీ షాక్ ఇచ్చారు. మంగళవారం రాజ్యసభలో ఉదయం హరివంశ్ సభకు అధ్యక్షత వహించారు. అయితే, విపక్షాల ఆందోళనలతో ప్రారంభమైన కొద్దిసేపటికే రాజ్యసభ కార్యకలాపాలు బుధవారానికి వాయిదాపడ్డాయి. ఉపరాష్ట్రపతి రాజీనామా కారణంగా రాజ్యసభ ఛైర్మన్ పదవి సైతం ఆటోమేటిక్‌గా ఖాళీ అయ్యింది. ఉపరాష్ట్రపతి ఎగువ సభకు ఎక్స్-అఫిషియో ఛైర్మన్. ఈ పరిస్థితుల్లో ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం తెలుపడంతో వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభ కార్యకలాపాలు మొత్తం డిప్యూటీ- ఛైర్మన్ హరివంశ్ చూసుకోనున్నారు. పార్లమెంట్ సమావేశాల తొలిరోజున జగదీప్ ధన్‌ఖర్ చురుగ్గానే కనిపించారు. ఉదయం సభలో సానుకూలంగా చర్చలు జరపాలని ఆయన సభ్యులకు సూచించారు. జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మాన నోటీసును అంగీకరించిన ఆయన.. పక్రియను వివరించారు. జస్టిస్ శేఖర్ యాదవ్‌పై సమర్పించిన అభిశంసన నోటీసులో ఒక ఎంపీ డబుల్ సంతకంపై విచారణను చేయనున్నట్లు- తెలిపారు. అయితే, ఆరోగ్య కారణాలు పేర్కొంటు- ఆయన తక్షణం అమలులోకి వచ్చేలా ఆయన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు పంపిన రాజీనామా లేఖలో వైద్యుల సూచన మేరకు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చేందుకు రాజీనామా చేస్తున్నట్లు- ఆయన వెల్లడించారు.ఆయన మార్చిలో ఎయిమ్స్‌లో చేరారు. ఆ తర్వాత వైద్యులు ఆయనను ఢిల్లీ వెలుపలకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. జూన్‌లో ఉత్తరాఖండ్‌లోని కుమావున్ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన వేదికపైనే స్పృహ కోల్పోయారు. ఆ రోజు వేడి పరిస్థితులు ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. ఈ నెల ప్రారంభంలో ఆయన కేరళలో పర్యటించారు. ఈ సమయంలో ఆరోగ్యం క్షీణించగా.. భార్య ఆయనకు అండగా ఉన్నారు. జులై 17న ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన భార్య మంచినీళ్లు తీసుకువచ్చి ఇవ్వగా పరిస్థితి మెరుగైంది. ఈ క్రమంలోనే ఆయన ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వైద్యుల సూచనల మేరకు కీలక బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు- తెలుస్తున్నది.

# రికార్డు స్థాయిలో మహిళల ఉచిత ప్రయాణం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 18 నెలల ప్రజా పాలనలో 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని దాటి ఆడబిడ్డల ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయ వంతంగా కొనసాగుతుండటం ఆనందంగా ఉందన్నారు.లబ్ధిదారులైన ప్రతి ఆడబి డ్డకు అభినంద నలు తెలుపుతున్నానని అన్నారు. ఈ పథకాన్ని దిగ్విజయంగా అమలు చేయడంలో భాగస్వాములైన ఆర్టీసీ కార్మికులు, సిబ్బంది, యాజమాన్యానికి సీఎం రేవంత్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# ఐటీ మినహాయింపులో కాంగ్రెస్‌కు చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయానికి పన్ను చెల్లించాలని స్పష్టం చేసింది. 2017-18 సంవత్సరానికి సంబంధించి ఆదాయపన్ను రిటర్న్‌ల గడువు తేదీ డిసెంబర్ 31, 2018లో ముగియగా.. నిర్ణీత గడువులో రిటర్నులు దాఖలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైంది. 2019 ఫిబ్రవరి 2న వాటిని దాఖలు చేసింది. రూ.199 కోట్ల విరాళంలో రూపంలో వచ్చాయని చూపుతూ పన్ను మినహాయింపు కోరింది. అయితే, దీనిని 2019లో పరిశీలించిన ఐటీ- అధికారులు.. దాతల నుంచి ఎక్కువ మొత్తంలో విరాళాలు స్వీకరించినట్లు- కనుగొన్నారు. ఒక్కొకరి నుంచి గరిష్ఠంగా రూ.2వేల వరకు మాత్రమే విరాళం ఇచ్చే ఆస్కారం ఉండగా.. 14.49లక్షలను నగదు రూపంలో తీసుకున్నట్లు- గుర్తించారు. పన్ను మినహాయింపు విజ్ఞప్తిని తోసిపుచ్చిన ఐటీశాఖ అధికారులు.. మొత్తానికి పన్ను చెల్లించాలంటూ నోటీసులు పంపించారు. ఈ నిర్ణయాన్ని కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ టాక్స్ (అప్పీల్స్) సమర్థించారు. ఇన్‌కమ్ టాక్స్ అప్పీలేట్ ట్రిబ్యునల్‌కు వెళ్లినప్పటికీ తాజాగా అక్కడ కూడా చుక్కెదురైంది. దీంతోఆదాయపన్ను నోటీసుకులకు సంబంధించి కాంగ్రెస్ పార్టీకి మరోసారి చుక్కెదురయ్యింది.

# మరో ఎయిరిండియా విమానానికి అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్యాసింజర్లు, సిబ్బంది అలా విమానం ఖాళీ చేసి బయటకు వచ్చారో లేదో.. విమానంలో మంటలు చెలరేగాయి. విమానంలోని పవర్ బాక్సులు, పవర్ సప్లయ్ ఉండే భాగం నుంచి మంటలు వచ్చాయి. ఈ విషయాన్ని గుర్తించిన ఎయిర్ పోర్ట్ సెక్యూరిటీ, భద్రతా అధికారులు.. వెంటనే విమానంలోని మంటలను అదుపులోకి తెచ్చారు. మంటల కారణంగా విమానం కొంత భాగం డ్యామేజ్ అయ్యింది. ఎయిర్ ఇండియా స్పందించింది. ప్రయాణికులు, సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నారని తెలిపింది. విమానంలోని ఆక్సిలరీ పవర్ యూనిట్ లో మంటలు చెలరేగినట్లు గుర్తిచామంది. మంటలు చెలరేగడానికి కారణమేంటన్న దానిపై దర్యాప్తు జరుగుతోందని వెల్లడించింది. జూన్ 12న అహ్మదాబాద్ లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో దాదాపు 271 మంది చనిపోయిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటన దేశపౌరులు పూర్తిగా మరువకముందే మరోసారి ఎయిర్ ఇండియా విమానంలో ప్రమాదం జరగడం ప్రయాణికుల్లో భయాందోళన రేకెత్తిస్తోంది. మొత్తానికి ఈ ఘటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు- చేసుకోకపోవడంతో ప్రయాణికులు, అధికారులు, ఎయిర్ ఇండియా ఎయిర్ లైన్స్ ఊపిరి పీల్చుకున్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పేదలకు చేరాలి

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి తదితరులు మాట్లాడుతూ ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఈ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని,క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దానికగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణం సాంఘిక, బిసి, మైనారిటీ- సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్లలో నిర్వాహణపై ఎప్పుటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారంలో ఒక్కరోజు అధికారులందరూ ఆ హాస్టళ్లలో బస చేయాలని కలెక్టర్లను మంత్రులు ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు వీటి నిర్వాహణపై పలు సూచనలు చేశారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావొద్దని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు శ్రీ పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమారులు జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతల్లో భాగంగా శానిటేషన్‌ను చేపట్టాలని, అన్ని జిల్లాల్లో ఎగ్ టెండర్స్ పక్రియను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు- చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హు÷నై ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాలో లబ్ధిదారుడినికి ఉచితంగా అందజేయాలని, ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారునికి ఎలాంటి భారం కలుగకుండా చూడాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ప్రతి వారం దీనిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. భూభారతిలో నమ్మో÷నై దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యకార్యదర్శులు నదీమ్, ఎన్. శ్రీధర్, దానకిషోర్, నవీన్‌మిట్టల్, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తూ, కార్యదర్శులు లోకేశ్‌కుమార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, విపి గౌతమ్, పిసిసిఎఫ్ సువర్ణ, ఇ.శ్రీధర్, సృజన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై వెనకడుగు లేదు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. కులగణన అవసరం లేదని భాజపా మొదట మాట్లాడింది. తెలంగాణ ప్రభుత్వం, రాహుల్ గాంధీ ఒత్తిడితో జనగణనలో కులగణన చేరుస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. ఈ బిల్లుకు పార్లమెంట్‌లో అన్ని పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తాం. కులగణనను క్యాబినెట్‌లో, శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదించాం. అసెంబ్లీలో మద్దతు తెలిపిన పార్టీలు పార్లమెంట్‌లోనూ మద్దతు తెలపాలి. ఆర్డినెన్స్ గవర్నర్ ఆమోదం పొందగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందుకెళ్తాం అని అన్నారు. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన ఆధారంగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ముందకెళ్తామని స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో కొన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని, అసెంబ్లీలో మద్దతు తెలిపిన పార్టీలు పార్లమెంట్లో కూడా పోరాటం చేయాలని కోరారు. ఈ బిల్లు త్వరగా ఆమోదం పొందే ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని.. ఆయన చెప్పిన మాట ప్రకారమే రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కుల గణన నిర్వహించామని గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో కులగణన అంశం తెరపైకి రావడంలో తెలంగాణ రాష్ట్రానిది కీలక పాత్ర అని పేర్కొన్నారు. తెలంగాణలో కులగణన చేసిన తర్వాతే దీనిపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైందన్నారు. కులగణన సర్వేను చాలా పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించామని అందుకే తెలంగాణను చూసి కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేస్తామని ప్రకటించిందన్నారు. తెలంగాణ జరిగిన విధానమే రేపు దేశవ్యాప్తంగా అమలు కానుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కులగణన, జనగణన చేయడానికి ఇంకా చాలా సమయం ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఏవైనా న్యాయపరమైన సమస్యలు వస్తే ఎదుర్కొవడానికి కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు.భారత రాష్ట్ర సమితి ప్రజలను మభ్యపెట్టింది. అందరూ అలాగే చేస్తారని ఆ పార్టీ నేతలు అనుకుంటున్నారేమో. కులగణన సర్వేను చాలా పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాం. అందుకే తెలంగాణను చూసి కేంద్రం కూడా కులగణనను ప్రకటించిందని భట్టి అన్నారు. రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావుకు బీసీలంటే చిన్నచూపు ఉన్నట్లుంది. ఆయన పంపిన లీగల్ నోటీసులకు ఎలా సమాధానం చెప్పాలో నాకు తెలుసు. నోటీ-సులకు భయపడేది లేదని కౌంటర్ ఇచ్చారు. నోటీసులు అందిన తరువాత ఏవిధంగా సమాధానం చెప్పాలో తనకు తెలుసన్నారు. రామచందర్ రావుకి దళితులన్నా బడుగు బహీన వర్గాలన్నా చిన్న చూపని విమర్శించారు. రోహిత్ వేముల ఆత్మహత్య చేసుకోవడానికి రామచందర్ రావు కూడా కారణమంటూ ఇటీవల భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రివార్డుగా బీజేపీ అధిష్టానం ఆయనకు తెలంగాణ చీఫ్ పదవి ఇచ్చిందని ఆరోపించారు. రామచందర్ రావుకు తెలంగాణ చీఫ్ పదవి ఇవ్వడంపై బీజేపీ అధిష్టానం ఒకసారి పునరాలోచించాలని భట్టి అన్నారు. భట్టి వ్యాఖ్యలను తప్పుబట్టిన రామచందర్ రావు తన న్యాయవాదితో లీగల్ నోటీ-సులు పంపించారు. మూడు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని.. లేకపోతే రూ.25 కోట్ల పరువు నష్టం దావా వేస్తానని రామచందర్ రావు నోటీసుల్లో హెచ్చరించారు. దీనిపై క్రిమినల్ కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని సూచించారు.

# బీసీలను మోసం చేయడమే కాంగ్రెస్ అసలు వైఖరి : బీఆర్ఎస్ పార్టీ

**హైదరాబాద్,జులై 22(తెలుగు - వెలుగు):** స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ మొదలుకొని బీసీ డిక్లరేషన్ వరకు అడుగడుగునా బీసీలను మోసం చేయడమే కాంగ్రెస్ అసలు వైఖరి అని బీఆర్ఎస్ పార్టీ ధ్వజమెత్తింది. అందుబాటులో ఉన్న బీసీ నేతలతో కేటీఆర్ సమావేశమై బీసీలకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసంపై చర్చించారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి మోసపూరిత వైఖరినే అనుసరిస్తుందని బీఆర్ఎస్ పార్టీ అభిప్రాయపడింది. కులగణన నుండి ప్రారంభించి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువస్తున్న ఆర్డినెన్స్ వరకు అన్ని స్థాయిల్లోనూ బీసీలను మోసం చేయడమే కాంగ్రెస్ అసలైన లక్ష్యంగా ఉందని విమర్శించింది.బోనాల పండుగ సందర్భంగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంట్లో అందుబాటులో ఉన్న బీసీ ప్రజాప్రతినిధులతో జరిగిన సమావేశంలో బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ద్రోహ పూరిత కార్యక్రమాలపైన కేటీఆర్ విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీ కేవలం బీసీలను మోసం



చేయాలన్న దురుద్దేశంతోనే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన అంశంలో, ప్రతి సందర్భంలో చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిందని బీసీ నేతలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారు.తాము తీసుకువచ్చిన చట్టం ఆమోదం పొందదని తెలిసినా, మరోసారి ఆర్డినెన్స్ పేరుతో కొత్త నాటకానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతోందని వారు పేర్కొన్నారు. కులగణన జీవో నుండి గణన ప్రక్రియ వరకు బీసీల సంఖ్యను తగ్గించి చూపడంలో కాంగ్రెస్ దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకుండా బీసీలకు తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు.స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంలో కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిందన్నారు. తాము చేపట్టిన ప్రతీ ప్రక్రియలో ఉన్న లోపాలు, లొసుగులు ముందే తెలిసినా, బీసీలను మోసం చేయాలన్న దురాలోచనతో ఇప్పుడు కోర్టుల పేరుతో, చట్టపరమైన నిబంధనలు చూపిస్తూ తప్పించుకోవడానికి కాంగ్రెస్ రంగం సిద్ధం చేస్తున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కులగణన మరింత శాస్త్రీయంగా జరగాలని చెప్పే కాంగ్రెస్ పార్టీ.. అత్యంత లోపభూయిష్టంగా దురుద్దేశపూర్వకంగా నిర్వహించిన కులగణన సర్వేను జాతీయ రోల్ మోడల్‌గా చెప్పడం ద్వారా తెలంగాణ ప్రజలను మోసం చేయడమే కాకుండా, జాతీయ వేదికలపై అబద్ధాలు చెబుతున్నదని నేతలు మండిపడ్డారు. ఒకవైపు 42 శాతం రిజర్వేషన్ల అంశంలో బీసీలను మోసం చేస్తూనే.. బీసీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా కాంగ్రెస్ సర్కారు అమలు చేయకుండా బీసీలను మభ్యపెడుతుందని బీసీ నేతలు అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల కోసం ప్రారంభించిన పథకాలను రద్దు చేసి కొత్త పథకాలు ప్రారంభించకపోవడం ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీ వారికి చేస్తున్న ద్రోహమే అన్నారు.

# బిల్లుల ఆమోదంలో రాష్ట్రపతికి నిర్దిష్ట గడువు విధింపు

(మొదటి పేజీ తరువాయి)

విచారణ జరిగింది. దీనిపై అభిప్రాయాలు తెలియజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ విచారణ ను చేపట్టింది. వచ్చే మంగళవారం నాటికి దీనిపై స్పందన తెలియ జేయా లని ఆదేశించింది. ఇది ఒక రాష్ట్రానికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, మొత్తం దేశానికి సంబంధించిన విషయమని గమనించాలని వ్యాఖ్యానించిం ది. శాసనసభలు ఆమోదించిన బిల్లులపై ఆయా రాష్ట్రాల గవర్నర్లు, రాష్ట్రపతి ఒక కాల వ్యవధిలోగా చర్యలు తీసుకోవాలని గత ఏప్రిల్‌లో సుప్రీం కోర్టు పేర్కొంది. దీనిపై స్పందించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మ తనకు రాజ్యాంగం లోని 143(1) అధికరణం ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకొన్ని 14 కీలక ప్రశ్నలను అత్యున్నత న్యాయస్థానం ముందుంచారు. ప్రజా ప్రయోజనంతో ముడిపడి ఉన్న చట్టపరమైన అంశాలపై రాష్ట్రపతి సుప్రీం కోర్టు అభిప్రాయం తెలుసుకునేందుకు ఆ కోర్టు ముందు తన ప్రశ్నను ఉంచవచ్చని సుప్రీం కోర్టు దానిపై విచారణ జరిపి తన అభిప్రాయాన్ని రాష్ట్రపతికి తెలియజేయవచ్చని 143(1) అధికరణం తెలియజేస్తోంది.

# తెలంగాణలో మూడ్రోజులు భారీ వర్షాలు



**హైదరాబాద్,జులై 22(తెలుగు - వెలుగు):** ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో తెలంగాణలో మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రక టించింది. రాష్ట్రంలో పలు జిల్లాలకు ఇవాళ రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు- వాతావరణ శాఖ సంచాలకురాలు డాక్టర్ నాగరత్న తెలిపారు. కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు- తెలిపారు. ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. వీటికి ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు- చెప్పారు.

## ఎమ్మెల్యే నల్లమిల్లికి
# కృతజ్ఞతలు





**తెలుగు - వెలుగు, తూ గో జిల్లా బ్యూరో (అనపర్తి):** నియోజకవర్గ ప్రధాన కేంద్రం "అనపర్తి" దేవి చౌక్ నుండి రైల్వే స్టేషన్ వరకు గల తోపుడు బండ్ల వ్యాపారస్తుల సమస్య పరిష్కారం చేసిన సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను)ని తోపుడు బండ్ల వ్యాపారస్తులు సత్కరించారు. మంగళవారం అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ని తోపుడు బండ్ల వ్యాపారస్తులు కలిసి పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**సదాశివపేట జులై 22 తెలుగు వెలుగు ప్రతినిధి:** మండలంలోని వెల్టూరు గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆదేశాల మేరకు వెల్టూరు గ్రామంలో లబ్ధిదారులు పెంటయ్య 43,500, ఈశ్వరయ్య 26,000 రూపాయల చెక్కును లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. చింత ప్రభాకర్ పేదల పెన్నిధి అని, చింత ప్రభాకర్ చేతులమీదుగా సీఎం ఆర్ అఫ్ చెక్కులు కోట్ల రూపాయల లో పంపిణీ చేయడం జరిగింది అన్నారు.సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు చింత ప్రభాకర్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ యాదమ్మ కృష్ణ, సత్యనారాయణ, పాండు, సురేష్ ,చోటు, దేవయ్య, సుందర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

**తెలుగు వెలుగు ప్రతినిధి (, ఏర్గట్ల : మండల)** ఏర్గట్ల మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఇంగ్లీష్ సబ్జెక్ట్ బోధించడానికి తాత్కాలిక గెస్ట్ ఫ్యాకల్టీ కై మహిళ టీచర్ల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్ ఓ సుంకరి సంధ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే మహిళ దరఖాస్తుదారులు ఏం ఏ ఇంగ్లీష్ చదివి, టెట్ పాసై ఉండాలని, పూర్తి వివరాలతో రెండు రోజుల్లో ఏర్గట్ల కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

## జక్కంపూడీ రాజా దీక్ష అణచివేసే కుట్ర: మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి

**తెలుగు - వెలుగు, తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి)** రాజమహేంద్రవరం ఆంధ్రా పేపర్ మిల్లు కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించిన ఆమరణ నిరాహార దీక్షకు కూటమి ప్రభుత్వం భయపడినట్లు స్పష్టంగా కనిపిస్తోందని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు.కార్మికుల పక్షంలో పోరాడుతున్న నేతను అణచి వేయాలనే ఉద్దేశంతో ఆయనను హౌస్ అరెస్ట్ చేసిన తీరును సత్తి సూర్యనారాయణ రెడ్డి తీవ్రంగా ఖండించారు.మంగళవారం సత్తి సూర్యనారాయణ రెడ్డి జక్కంపూడి రాజాని కలిసి సంఘీభావం ప్రకటించారు.



## పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరి
# భాగస్వామ్యం అవసరం





**తెలుగు వెలుగు ప్రతినిధి (ఏ ర్గట్ల మండలం):** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమనే సంకల్పంతో, ఈ రోజు ZPHS తడపాకల్ పాఠశాలలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ కార్యక్రమం మరియు ECO క్లబ్ లోభాగంగా ఘనంగా చెట్లు నాటే కార్యక్రమం నిర్వహించబడింది."పిల్లలలో చిన్న వయసులో నుంచే పర్యావరణ ప్రేమను పెంపొందించడం ముఖ్యమని మొక్కలు నాటడం ద్వారా వారు భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదగవచ్చు అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు M.A.జావిద్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కేవలం మొక్కలు నాటడంలో మాత్రమే కాక, వాటి సంరక్షణపై కూడా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని PD ఆనంద్ ప్రతి పాఠశాలలో "ఒక విద్యార్థి - ఒక చెట్టు" అనే సిద్ధాంతాన్ని అమలు చేస్తూ, విద్యార్థులను బృందాలుగా తమకు కేటాయించిన మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని తెలియజేశారుఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, గంగాధర్, రాములు, రవి, స్వప్న, నవీన్, దేవానంద్ గౌడ్, చక్రపాణి ,భూపతి, విజయ, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు

# పాలమూరులో వైద్య, విజ్ఞాన అవగాహన సదస్సు





**తెలుగు - వెలుగు, తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):** గ్రామాల్లో ప్రాథమికంగా వైద్య సేవలందించే పీఎంపీలు ఆయా మండలాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు అన్నారు. మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో అనపర్తి, బిక్కవోలు మండలాల అధ్యక్షులు వాసంశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన పొలమూరు శ్రీదేవి ఏసీ ఫంక్షన్ హాల్లో వైద్య, విజ్ఞాన అవగాహన సదస్సు, సమావేశం నిర్వహించారు.ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ పీఎంపీ, ఆర్ఎంపీల సేవలను ప్రభుత్వం వినియోగించుకునేందుకు మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్దన్ చొరవతో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పీఎంపీ తమ పేర్లు మండల కమిటీ కి అందజేయాలని ఆయన సూచించారు. తొలుత జరిగిన కాకినాడ కు చెందిన మెడికవర్ హాస్పిటల్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మాధవరావు ఎముకలకు సంబంధించిన ఇబ్బందులు గురించి, అత్యవసర ట్రామా కేసుల్లో పీఎంపీలు అందించే ప్రథమ చికిత్స గురించి వివరించారు.ఇ ఎన్ టి వైద్యురాలు డాక్టర్ నిఖితా రెడ్డి మాట్లాడుతూ చెవి,ముక్కు,గొంతుకకు సంబంధించిన రుగ్మతలను వివరించడం జరిగింది.వర్షాకాలంలో ఎక్కువగా ఇబ్బంది పడే సైనసైటీస్ గురించి వివరించారు.అనంతరం వైద్యులను సభ్యులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి దేవానందం, మండల కార్యదర్శి డి సాయిరామారెడ్డి,కోశాధికారి నీలంశెట్టి శ్రీనివాస్,ఎన్ఎస్ చలం,కె సత్యనారాయణ,పి బాల సుబ్రహ్మణ్యం, కేఎస్ఎన్ మూర్తి, పీటీఎల్ నారాయణ, బాబ్జీ, పరంశెట్టి శ్రీనివాస్,తిరుపతి శ్రీనివాస్ పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# శంకరా.. జన విహారహార..

- **కళాశాల భవనం అద్భుతం..మహా అద్భుతం..**
- **నువ్వు మొండిఘటం.. ఇలాంటివి నీకే సాధ్యం..**
- **ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై మంత్రి శ్రీధర్ బాబు ప్రశంసల వర్షం.**



శంకరా.. నిత్యం జనాల్లో విహరించే వాడివి.. వాళ్ల సమస్యలు నీకు తెలిసినంతగా ఎవరికి తెలియవు.. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం నిజంగా అద్భుతం.. మహా అద్భుతం.. నువ్వో మొండిఘటం.. ఇలాంటివి నీకే సాధ్యం.. అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. షాద్ నగర్ పట్టణంలో దాతల విరాళాలకు తన సొంత ఖర్చులను జోడించి ఎమ్మెల్యే వీర్లపల్లి నిర్మిస్తున్న నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలను చూసిన ఆయన మహాద్భుతం అంటూ కొనియాడారు. ప్రభుత్వ సహకారం లేకుండా ఇంత పెద్ద కళాశాలను నిర్మించాలనుకోవడం నిజంగా ప్రశంసనీయమన్నారు. కళాశాల నిర్మాణంలో సింహ భాగాన్ని తానే ఖర్చు పెడుతూ ఒక యజ్ఞంలో పనిని చేపడుతుండడం కాంగ్రెస్ పార్టీకి గర్వకారణం అన్నారు. ఈ కళాశాలలో అత్యాధునిక వసతులను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. అలా చేస్తే ఎమ్మెల్యేగా నీ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్ను ఇంతగా ఎందుకు అభినందిస్తారో నీకు దగ్గరగా ఉంటారో ఇప్పుడు అర్థమైంది అంటూ మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యేతో అనడం విశేషం.ఇంత మంచి కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పనిసరిగా హాజరవుతారని స్పష్టం చేశారు. గతంలో కూడా మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ కళాశాలను చూసి ఎమ్మెల్యే సెల్యూట్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో మంత్రి కూడా ఎమ్మెల్యే పై ప్రశంసల వర్షం కురిపిచడంతో వీర్లపల్లి అభిమానులు సంతోషపడుతున్నారు..

# జాబ్ మేళాతో యువతకు అవకాశం : ఎమ్మెల్యే నల్లమిల్లి



**తెలుగు - వెలుగు,తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):** నిరుద్యోగ యువత జాబ్ మేళా అవకాశాన్ని అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.మంగళవారం అనపర్తి మండలం రామవరంలో ఈనెల 26 న అనపర్తి సాయి మాధవి డిగ్రీ కళాశాలలో జరగబోయే "జాబు మేళా" కరపత్రాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు.ఈ జాబు మేళాలో 12 కంపెనీలు పాల్గొంటున్నాయని నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి సూచించారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), కర్రి చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ చైతన్య విద్యా సంస్థలు తమదైన శైలిలోస్మార్ట్ లివింగ్ కార్యక్రమాలుమొక్కల పెంపకం భావితరాలకు ఒక భరోసా




**సంగారెడ్డి జిల్లా 22 తెలుగు వెలుగు ప్రతినిధి**ప్రస్తుత వైవిద్యమైనటువంటి జీవిత విధానంలో ఎటుచూసిన కాలుష్యంలో జీవనం కొనసాగుతుంది. ప్రస్తుత జీవితంలో ఆక్సిజన్ యొక్క ప్రాముఖ్యత చాలా పెరిగిందని దీనికి గల కారణం చెట్లను నరికి వేయడం మరియు వాతావరణ కాలుష్యము కారణమని తమ ఉద్దేశాన్ని వ్యక్తపరిచారు. అయితే ప్రతి సంవత్సరం సొసైటీలో జరిగే వివిధ రకాల పరిస్థితులు అనుగుణంగా విద్యార్థులలో అవగాహన కల్పించడం కోసం శ్రీ చైతన్య విద్యా సంస్థలు తమదైన శైలిలోస్మార్ట్ లివింగ్ పేరిట కార్యక్రమాలు చేపడుతున్నారు. రేపటి తరానికి ఈ కార్యక్రమాలు ఎంతగానోదోహదపడుతున్నాయి.ఇటీవలసెంట్రల్గవర్నమెంట్ వారు రూపొందించిన కార్యక్రమాన్ని అనుసరించి జూన్ మరియు జూలై నెలలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా గ్రీన్ ఇండియా మిషన్( పచ్చని మరియు పరిశుభ్రమైన పరిసరాలు) కార్యక్రమాన్ని శ్రీ చైతన్య విద్యాసంస్థలు చేపట్టారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పాండురంగం అకాడమిక్ డీన్ రామ ఐపీఎల్ ఇంచార్జ్ సతీష్ ,సి బ్యాచ్ ఇంచార్జ్ ప్రమీలా పాటిల్,ప్రైమరీ ఇంచార్జ్ సునీతా మరియు విద్యార్థులుతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పాండురంగం మాట్లాడుతూ ఈరోజు మనం నాటే ప్రతి మొక్క రేపటి తరానికి ఎంతగానోసహాయపడతాయని, రేపటి తరానికి ఈ తరం వాళ్లు ఇచ్చే గొప్ప ఆసరా మొక్కల నాటడం అని ప్రతి ఒక్కరు తమవంతుగా ఒక్కొక్క మొక్కను నాటాలని హితబోధ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అకాడమిక్ డీన్ రాము మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ విద్యార్థి స్థాయి నుండే మంచి అలవాటులను నేర్చుకోవాలని, పచ్చని మరియు పరిశుభ్ర పరిసరాలు నెలకొల్పడంలో విద్యార్థులు తమ ముఖ్యపాత్రను వహించాలని చెప్పుకొచ్చారు. అలాగే ప్రైమరీ ఇంచార్జ్ సునీతమాట్లాడుతూ రేపటి తరానికి ఈ తరం వాళ్ళు ఇచ్చే అత్యద్భుతమైనటువంటి బహుమతి పచ్చని మరియు పరిశుభ్ర పరిసరాలని, తన ఉద్దేశాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఇన్చార్జెస్ సంతోష మరియు ప్రమీల గారు ప్రస్తుత విధానంలో మొక్కలు మరియు వాటి పెంపకం యొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని తమవంతుగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలోపాల్గొన్నటువంటి విద్యార్థులను పాఠశాల ఏజిఎం.శివరామకృష్ణ, రీజినల్ ఇంచార్జ్ పద్మజా, అకాడమిక్ కో ఆర్డినేటర్స్ మురళీకృష్ణ, వెంకట శివ ఇతర అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం తమ అభినందనలను తెలియపరిచారు.


# ఘనంగా దాశరధి జయంతి వేడుకలు

**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** తెలంగాణా కవి దాశరధి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను అశ్వారావుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు పుల్లయ్య, దుర్గయ్య ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత అధ్యక్షతన జరిగిన జయంతోత్సవ సభలో ఆమె మాట్లాడుతూ జన్మజన్మాల బూజు నిజాం అంటూ నాటి నిజాం పాలన పై ఎక్కుపెట్టిన అస్త్రంలా విమర్శలు గుప్పిస్తూనే నా తెలంగాణా కోటిరతనాల వీణ అంటూ తెలంగాణా కలను సాకారం చేయాలని కోరుతూ నిద్రాణమై ఉన్న తెలంగాణా సమాజాన్ని మేల్కొల్పిన గొప్ప కవి అని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు మాట్లాడుతూ ఉద్యమమే ఊపిరిగా జీవిస్తున్న కాలంలో కలిగిన కష్టాల తిమిరంతో సమరం చేసి అగ్నిధారలు కురిపించినన కవి దాశరధి అని, తాత్విక చింతనకు ఆయన రాసిన గాలీబ్ గీతాలు అద్దం పడతాయని, సర్వమానవ సౌభ్రాతృత్వం ఆయన కవిత్వ సిద్ధాంతమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో యూరియా కొరత రాకుండా చర్యలు తీసుకోవాలి

- స్టాక్ వివరాలు అన్ని దుకాణాలలో స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలి
- సీజనల్ వ్యాధులు ప్రజలకు ఉన్న చర్యలు తీసుకోవాలి
- జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష



**సంగారెడ్డి జిల్లా జూలై 22 తెలుగు వెలుగు ప్రతినిధి:** జిల్లాలో ఎక్కడ యురియా కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ యూరియా కొరత సీజనల్ వ్యాధులవ్యాప్తిచెందకుండా చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు...జిల్లాలో యూరియా కొరత రాకుండా అధికారులుచర్యలుతీసుకోవాలని అన్ని దుకాణాలలో యూరియా స్టాక్ వివరాలు, స్టాక్బోర్డులలోప్రదర్శించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట ధరకు మాత్రమే యూరియా విక్రయించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో యూరియా స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అది వ్యవసాయ శాఖఅధికారులకుసూచించారు. జిల్లాలో వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్తచర్యలుతీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేయాలని, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ( రెవెన్యూ) మాధురి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా వైద్యాధికారిణి గాయత్రీ దేవి, డిసిహెచ్ఓ సంగారెడ్డి, ఇరిగేషన్ డి. ఈ. భీమ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు


# మునిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు విన్నపం



**మునిపల్లి జూలై 22 తెలుగు వెలుగు ప్రతినిధి:** మండలంలో మన ప్రియతమ నాయకులు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ పర్యటన.వివిధ శంకుస్థాపనాలు, భూమి పూజలు.తేదీ25-జూలై-2025.శుక్రవారం నాడు సమయం 10:00 గంటల మునిపల్లి మండలం లోని బుధేరా గ్రామంలో కార్యక్రమాలు చేసి తర్వాత మునిపల్లి గ్రామంలో కార్యక్రమం పూర్తి చేసి అల్లాపూర్ గ్రామంలో కార్యక్రమాలు చేసి తాటిపల్లి కస్తూరిబా కళాశాల వెళ్లి అక్కడనుంచి మక్తక్యాసారం రోడ్ భూమి పూజ కార్యక్రమం చేయనున్నారు మంత్రి.మన ప్రియతమ నాయకులు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారం.మునిపల్లి మండలంలోని అన్ని గ్రామాల సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్లు మాజీ ఎంపీటీసీలు మాజీ వార్డ్ మెంబర్లు సొసైటీ డైరెక్టర్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వివిధ సంఘాల అధ్యక్షులు యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు కిసాన్ సెల్ అధ్యక్షులు ఎస్సీ సెల్ అధ్యక్షులు బీసీ సెల్ అధ్యక్షులు మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్టీ సెల్ అధ్యక్షులు అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోషల్ మీడియా వారియర్స్, పాత్రికేయ మిత్రులు మీడియా మిత్రులు, ప్రతి విలేజ్ నాయకులు కార్యకర్తలను గ్రామ ప్రజలను, రైతులను తీసుకొని హాజరు కాగలరనితెలియజేస్తున్నాము.మీ పిల్లోడి సతీష్ కుమార్ కాంగ్రెస్ పార్టీ మునిపల్లి మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి చైర్మన్-ఏఎంసి-రాయికోడ్

# రఘు నాయక్ ఇంట్లో ఎమ్మెల్యే శంకర్ అల్పాహార విందు

- హాజరైన పలువురు ముఖ్య నాయకులు



షాద్ నగర్ నియోజకవర్గం గిరిజన నాయకుడు, కాంగ్రెస్ గిరిజన ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ పి రఘునాయక్ ఇంట్లో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అల్పాహార విందుకు హాజరయ్యారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులతో పాటు తదితరులు హాజరయ్యారు. అల్పాహార విందులో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ జెడ్పిటిసి వెంకటరామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్లమెంటరీ నాయకుడు పురుషోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, పట్టణ సీనియర్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, గ్రంథాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మదన్మోహన్ రెడ్డి, మైనార్టీ నాయకుడు మహమ్మద్ ఇబ్రహీం, పాషా, గ్రంథాలయ అభివృద్ధి డైరెక్టర్ క్యాసెట్ శీను, యువ నాయకులు ఆలీం శకీబ్, ఇసాక్, పదవులు యాదవ్, మసూద్ ఖాన్, ముబారక్ అలీ ఖాన్, మార్కెట్ డైరెక్టర్ మల్లేష్, శ్రీనగర్ కాలనీ శంకర్, రవి నాయక్, అఫ్జల్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ బోనాల జాతర మహోత్సవంలో పాల్గొన్న జనసేన నాయకులు ప్రేమ కుమార్



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** జనసేన పార్టీ నాయకులు శివశంకర్ , ఈశ్వర్రావుల ఆహ్వానం మేరకు కూకట్ పల్లి నియోజకవర్గంలోని ఏ వి బి పురం లో గల శ్రీ శ్రీ శ్రీ తలుపులమ్మ తల్లి నీలం మణికంఠ దుర్గమ్మ తల్లి దేవాలయం అమ్మవారుల బోనాల జాతరలో జనసేన పార్టీ కూకట్పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ప్రత్యేక పూజలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు .ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వేముల మహేష్ , పోలేబోయిన శ్రీనివాస్, పులగం సుబ్బు ,హర్షిత్ ,సాయికుమార్,వినయ్, విష్ణు, లక్కీ జయరాం తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే





**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మంగళవారం అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని దమ్మపేట మండలంలో రూ. 8.42 కోట్ల విలువైన బీటీ రోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామాల్లో ఆయనకు ఘన స్వాగతం పలకగా అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె మాట్లాడుతూ గిరిజన గ్రామాల మధ్య కనెక్టివిటీ మెరుగుపరిచే ఈ రోడ్లు ప్రజల రాకపోకలకు చాలా ఉపయోగకరంగా మారనున్నాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. ప్రజల సౌకర్యం కోసం వారి అవసరాలను తీర్చడానికి మా ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తూ నియోజకవర్గంలో బీటీ రోడ్లు సీసీ రోడ్ల నిర్మాణం వేగంగా చేపట్టి పల్లె ప్రజలకు ప్రయాణాలను మెరుగు పరుస్తుందన్నారు. అంతేకాకుండా వ్యవసాయ రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోని నియోజకవర్గ వ్యాప్తంగా రైతులకు ఉపయోగపడే విధంగా గ్రావెల్ రోడ్లును అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భగవాన్ రెడ్డి, ఎంపీడీవో రవీంద్రరెడ్డి, ఎంపీఓ రామారావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కేరళ మాజీ ముఖ్యమంత్రి వియస్ అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగిద్దాం

- సంస్మరణ సభలో సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి ఎన్. రాజు పిలుపు



**షాద్నగర్ :** కేరళ మాజీ ముఖ్యమంత్రి వి యస్ అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి రాజు పిలుపు నిచ్చారు. ఈరోజు సిపిఎం పార్టీ కార్యాలయంలో పార్టీ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీను నాయక్ అధ్యక్షతన జరిగిన సంస్మరణ రాజు సభలో మాట్లాడుతూ అనారోగ్యంతో కామ్రేడ్ వి.ఎస్. అచ్యుతానందన్ నిన్న మరణించారు.కమ్యూనిస్ట్ ఉద్యమంలో అత్యుత్తమ నాయకుడు మరియు అనుభవజ్ఞుడైన వి.ఎస్. అచ్యుతానందన్ మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వి.ఎస్. అచ్యుతానందన్ పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు. ఆయన వయస్సు 101 సంవత్సరాలు. అచ్యుతానందన్ కేరళలో వివిధ పోరాటాలకు నాయకత్వం వహించిన సమర్థుడైన నాయకుడు,1940లో, ఆయనకు కేవలం పదిహేడేళ్ల వయసులో, వి.ఎస్. కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు. కుట్టనాడ్లో భూస్వాములచే దారుణమైన దోపిడీకి గురైన వ్యవసాయ కార్మికుల మధ్య పని చేయడానికి కృష్ణ పిళ్లై అతనికి అప్పగించారు. ట్రావెన్కోర్ దివాన్కు వ్యతిరేకంగా జరిగిన పున్నప్రా వాయలార్ తిరుగుబాటు సమయంలో, వివిఎస్ అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. అరెస్టు అయిన తర్వాత, అతను తీవ్రమైన కస్టోడియల్ హింసకు గురయ్యాడు.వివిఎస్ ఏడు పర్యాయాలు కేరళ అసెంబ్లీకి ఎన్నికయ్యారు, ఆయన రెండు పర్యాయాలు ప్రతిపక్ష నాయకుడిగా పనిచేశారు మరియు 2006 నుండి 2011 వరకు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన పదవీకాలంలో శ్రామిక ప్రజల సంక్షేమం కోసం అనేక శాసన మరియు పరిపాలనా చర్యలు తీసుకున్నారు.పార్టీతో తన ఎనిమిదిన్నర దశాబ్దాల అనుబంధంలో, కేరళలో కమ్యూనిస్ట్ ఉద్యమం స్థిరమైన వృద్ధిని సాధించింది. ప్రజా వక్తగా వివిఎస్ ప్రేక్షకులతో నేరుగా సంభాషించే కళలో ప్రావీణ్యం సంపాదించారు. కఠినమైన జీవనశైలి మరియు సామాజిక న్యాయం పట్ల అచంచలమైన నిబద్ధతకు పేరుగాంచిన వి.ఎస్. అచ్యుతానందన్ కేరళ రాజకీయాలపై చెరగని ముద్ర వేశారు. ఆయన భార్య, కుమారుడు మరియు కుమార్తెకు హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తోంది ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు శ్రీను బేరి శ్రీనివాస్ నాయకులు మహమ్మద్ బాబు. కావలి రాజు వడ్ల చంద్రమౌళి . వెంకటరమణ ఆంజనేయులు గౌడ్ బలరాం గౌడ్. నరసిం హులు గౌడ్. శ్రీకాంత్. ఆది. శివ శంకర్.సుమేర్ . ఆరిఫ్.అయాన్.. మహేష్. తదితరులు పాల్గొన్నారు..

# భళా మాస్టర్ అహ్మద్ ఖాన్ భళా

- నేషనల్ స్టార్స్ ఎక్సలెన్స్ అవార్డు సొంతం చేసుకున్న మాస్టర్ అహ్మద్ ఖాన్




వైఎంకె అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలొ విజయవాడ పట్టణంలోని గుజ్జల సరళ దేవి ఫంక్షన్ హాల్ లో నేషనల్ స్టార్స్ ఎక్సలెన్స్ అవార్డు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ అవార్డు ఫంక్షన్ లో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ ను వైఎంకె అకాడమీ మాస్టర్ రూపస్ పాల్,సినీ హీరో భానుచందర్ చేతుల మీదుగా శాలువాలతో సన్మానం చేసి సర్టిఫికెట్ మరియు మెడల్ అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ కాలనుగుణంగా దేశం లో రోజు రోజుకు ఆడవాళ్లు, పిల్లలపై అసాంగిక చర్యలు పెరుగుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరు తమ ప్రాణ రక్షణ కొరకు కుంగ్ ఫు, కరాటే వంటి విద్యను కచ్చితంగా నేర్చుకోవాలని ఆయన సూచించారు. కుంగ్ ఫు, కరాటే తో సెల్ఫ్ డిఫెన్స్ తో పాటు మెదడు శక్తి ని, శరీరాన్ని ఆరోగ్య కరంగా ఉంటుందని అన్నారు. తనకు ఈ అవార్డు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మాస్టర్ అహ్మద్ ఖాన్ కు అవార్డు దక్కడంతో షాద్ నగర్ నియోజకవర్గం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

# గౌడ కులస్తుల బోనాల ఊరేగింపులో పాల్గొన్న బుచ్చిరెడ్డి, చింత సాయినాథ్



**సంగారెడ్డి జూలై 22 తెలుగు వెలుగు ప్రతినిధి:** ఆషాడ మాసం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనాల ఊరేగింపు, పలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్, మాజీ సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు...నిర్వాహకులు వారిని శాలువాతో సన్మానించారు... బోనాల ఊరేగింపులో రాకేష్ బోనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.వందలాదిమంది భక్తుల మధ్య కొనసాగిన ఊరేగింపు కన్నుల పండుగగా కొనసాగింది. పోతురాజులవిన్యాసాలు ,శివసత్తుల పునకాలు, డప్పుల దరువులు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గౌడ సంఘం అధ్యక్షుడు నాగరాజ్ గౌడ్, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి ,శ్రీనివాస్ గౌడ్, రాములు గౌడ్ తదితరులు ఉన్నారు...

# బోనాల పండుగను ఘనంగా నిర్వహించిన విద్యార్థులు





**తెలుగు వెలుగు ప్రతినిధి.. (ఏర్గట్ల మండల)** .. ఏ ర్గట్ల మండలకేంద్రం ఏర్గట్ల లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, పాఠశాల విద్యార్థులు అందమైన వేశాధారణలతో తయారై బోనాల పండుగను భక్తి శ్రద్ధ లతో మంగళవారం ఘనంగా నిర్వహించచారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ మాట్లాడుతూ.. బోనాల పండుగ తెలంగాణ రాష్ట్రంలో ఆషాడ మాసంలో జరుపుకునే ముఖ్యమైన పండుగ అన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయ బృందం సృజన్,ఉదయ్,గణేష్, విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబుకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

షాద్ నగర్ ఇందిరా మహిళా శక్తి ఆర్థిక ప్రగతి కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ఇంచార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు శాలువా కప్పి పులా బొకే అందజేసి స్వాగతం పలికిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి .



# ప్రతి కేసులో నాణ్యమైన ధర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలి..

**● లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలి.. ● ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకొని, ఇన్వెస్టిగేషన్లో మెళకువలు నేర్చుకోవాలి.. ● సైబర్ క్రైమ్ గురించి ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.. ● మంత్లీ క్రైమ్ రివ్యు మీటింగ్ లో భాగంగా అధికారులకు పలు సూచనలు చేసిన..జిల్లా ఎస్పీ. శ్రీ పరితోష్ పంకజ్ ఐపియస్.**






**సంగారెడ్డి జిల్లా జూలై 22 తెలుగు వెలుగు ప్రతినిధి:** మంత్లీ క్రైమ్ రివ్యు మీటింగ్ లో భాగంగా ఈ రోజు సంగారెడ్డి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అధికారులతో నెల వారి నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్. ఈ సందర్భంగాఎస్పీమాట్లాడుతూ.. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అండగా ఉండాలని, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత లిమిట్లో ఉండాలన్నారు. అత్యాచార, పోక్సో కేసులలో ధర్యాప్తును వేగవంత చేయాలని, నిర్ణిత గడువులో దోషులను న్యాయస్థానం ముందు ఉంచాలని అన్నారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ఎఫ్.ఎస్.ఎల్ పెండింగ్ రిపోర్ట్స్ పొంది, కేసులను ఫైనల్ చేయాలని అన్నారు. నెంబర్ పెండింగ్ కేసులలో సంభందిత మెజిస్ట్రేట్ లతో డిస్కస్ చేసి సిసి నెంబర్ లను తీసుకోవాలని యస్.హెచ్.ఓ లకు సూచించారు. ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకొని, ఇన్వెస్టిగేషన్ లో మెళకువలు నేర్చుకోవాలని అన్నారు.నేరం జరిగిన వెంటనే నేరస్తాలనికి చేరుకొని, నేరస్థలంలో ఉన్న సాక్షాదారాలు చెరిగిపోకుండా ప్రొటెక్ట్ చేస్తూ నేరస్థల చిత్రపటాలు తీయించాలని, ఫింగర్ ప్రింట్, క్లూస్ టీం సహాయాంతో ఆధారాలు సేకరించాలని అన్నారు. ఆస్తి సంభందిత నేరాలకు సంభందించి పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, పాపిలోన్ డివైస్ ను వినియోగించి, ఛాయిస్ ప్రింట్ ద్వారా వీలైనంన్ని ఎక్కువ కేసులను ఛేదించాలని అన్నారు. గ్రేవ్, ఆస్థి సంభందిత నేరాలలో నేరస్తుల ఫింగర్, అరచేతి ముద్రలు తప్పనిసరిగా చేకరించి, ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న వివిధ రకాల నేరాలనుఛేదించడంలో ఫింగర్ ప్రింట్, క్లూస్ టీం సిబ్బంది సేవలు అభినందనీయం అని అన్నారు. ఆన్లైన్ బెట్టింగ్స్, బెట్టింగ్ యాప్స్, ఆన్లైన్ మోసాలు, డ్రగ్ దుర్వినియోగం మరియు ట్రాఫిక్ రూల్స్ పై జిల్లాప్రజలలో,విద్యాసంస్థలలో కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా అవగాహన కల్పిస్తూ ప్రజలను అప్రమత్తంచేయాలనియస్.హెచ్.ఒ లకు సూచించారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో ఆన్లైన్ లో వీడియో కాల్స్ చేసి, పోలీసు అధికారులం అంటే నమ్మరాదని, ఏ పోలీసు అధికారులు వీడియో కాల్స్ చేయరాని గుర్తించాలని అన్నారు. డిజిటల్ అరెస్ట్ లు ఉండవు, ఫిజికల్ అరెస్ట్ మాత్రమే ఉంటుందన్నారు. సైబర్ స్లేవరీ పేరుతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి ఇతర దేశాలకు పంపి ఇబ్బందులకు గురిచేస్తారని అన్నారు. జిల్లా ప్రజలు ఆన్లైన్ మోసాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగాఉండాలని, ఆన్లైన్ మోసాలకు గురి అయినట్లైతే మొదటి గంట (Golden Hour) లోపు 1930కు కాల్ చేసి లేదా యన్.సి.ఆర్.పి. https://www.cyber-crime.gov.in/ పోర్టల్ నందు నమోదు ఫిర్యాదు నమోదు చేయాలని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లు గా గుర్తించి, సైన్ బోర్డు లను ఏర్పాటు చేయించాలని సూచించారు. ఎన్ఫోర్స్మెంట్ లో భాగంగా ప్రతి రోజు సాయంత్రం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లు చేస్తూ, మద్యం తాగి వాహనాలను నడిపే వాహన దారీలపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఫేక్ నెంబర్ ప్లేట్స్, నెంబర్ ప్లేట్స్ మార్పు పై ప్రత్యేక దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, వాహనదారులతో మర్యాదగామాట్లాడాలన్నారు. సిసి కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ అన్నీ కుల మతాలకు చెందిన పవిత్ర స్థలాలలో మరియు పరిశ్రమలలో తదితర ముఖ్యమైన ప్రాంతాలలో కమ్మునిటీ సిసి కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా., ఇంటి రక్షణకై ఏర్పాటు చేసుకున్న సిసి కెమెరాలలో ప్రజలకు ఉపయోగపడే, వీధి రోడ్డుకు ఉన్న కెమెరాలను నేను సైతం కెమెరాలుగా జియో ట్యాగ్ చేయించేవిధంగా వివిధ సంఘాల పెద్దలకు అవగాహన కల్పించాలని యస్.హెచ్.ఒ లకు సూచనలు చేశారు. అనంతరం యస్.హెచ్.ఓ వాహనాలను తనిఖీ చేస్తూ. ప్రతి వెహికిల్ ను రెగ్యులర్ సర్వీస్ చేయించాలని, ఎలాంటి రిపేర్స్ ఉన్న తక్షణమే నివృత్తి చేస్తూ. వెహికిల్ పూర్తి స్థాయిలో కండిషన్ లో ఉండే విధంగా చూసుకోవాలని డ్రైవరులకు సూచించారు. ఈ వాహనాల తనిఖీలలో ఎఆర్ డియస్పీ నరేందర్, వెహికిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, అడ్మిన్ ఆర్.ఐ. రామరావ్ ఉన్నారు. ఈ సమీక్షా సమావేశంలో సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, పటాన్ చెర్వు డియస్పి ప్రభాకర్, జహీరాబాద్ డియస్పి సైదా నాయక్, నారాయణ ఖేడ్ డియస్పి వెంకట్ రెడ్డి, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్, ఐటి సెల్ ఇన్స్పెక్టర్ కిరణ్, కంట్రోల్ రూమ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి, సైబర్ క్రైమ్ డియస్పి వేణు గోపాల్ రెడ్డి ఇన్స్పెక్టర్ రవి మరియు జిల్లా ఇన్స్పెక్టర్స్, సబ్ఇన్స్పెక్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్లు కీలకం

## కలెక్టర్లతో వీ.సీలో మంత్రులు స్పష్టీకరణ



**సంగారెడ్డి జిల్లా జులై 22 తెలుగు వెలుగు ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ పథకాల అమలు పురోగతిని సమీక్షించారు . సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ పి ప్రావీణ్య వీ.సీలో పాల్గొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, రెసిడెన్షియల్ విద్యా సంస్థలు, వసతి గృహాలలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై మంత్రులు సమీక్షిస్తూ, కలెక్టర్లకు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కలెక్టర్లు, అధికారులు నిర్విరామంగా కృషి చేయాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని, క్షేత్రస్థాయిలో వాటి అమలులో జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దానికగుణంగా కార్యాచరణ ప్రణాళికనురూపొందించుకోవాలని మంత్రులు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్ల నిర్వాహణపై ఎప్పుటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, వారంలో ఒకరోజు అధికారులు హాస్టళ్లలో బస చేయాలని ఆదేశించారు. పెంచిన డ్కెట్ ఛార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించేలా చూడాలన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా శానిటేషన్‌ను చేపట్టాలని, అన్ని జిల్లాల్లో ఎగ్ టెండర్స్ ప్రక్రియను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.మహాలక్ష్మి పథకంలో భాగంగా రేపటికి 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్ల కు నిర్వాహణ తీరును పర్యవేక్షించడంపై పలు సూచనలు చేశారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రగతిని మంత్రులు సమీక్షిస్తూ, ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హుల్కెన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాలో లబ్ధిదారునికి ఉచితంగా అందజేయాలని, ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారునికి ఎలాంటి భారం కలుగకుండా చూడాలని అన్నారు. ప్రతి వారం దీనిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. భూభారతిలో నమోద్కెన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , డీఆర్డీఓ జ్యోతి , గృహనిర్మాణ శాఖ పి డి చలపతిరావు ,జిల్లా వైద్యాధికారిణి గాయత్రీ దేవి ,పౌర సరఫరాల శాఖా జిల్లా మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్ , సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చదివిన బడి రుణం తీర్చుకుందాం రండి..!

**● పూర్వ విద్యార్థులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపు.. ● ఆరు నెలల్లో పాఠశాల రూపురేఖలు మారుస్తానని హామీ.. ● చరిత్ర కలిగిన పాఠశాలగా జానంపేట బడికి కితాబు.. ● పాఠశాలను పూర్తిగా పరిశీలించిన ఎమ్మెల్యే.. ● ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన పాఠశాల బృందం..**





ఈ పాఠశాలలో చదివి నాయకులుగా, ఇతర రంగాలలో ప్రముఖులుగా ఎదిగిన పూర్వ విద్యార్థులు శిథిలావస్థలో ఉన్న పాఠశాలకు సాయం చేయాలని.. చదివిన పాఠశాల రుణం తీర్చుకునేందుకు ముందుకు రావాలని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని ఫరూక్ నగర్ ప్రభుత్వ జెడ్ పి హెచ్ ఎస్ (ఫరూక్ నగర్ హైస్కూల్) పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎన్.సీ.సీ యూనిఫాంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు. అదేవిధంగా ఎంఈఓ మనోహర్, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు శాలువాలతో, బొకేలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం పనులను ప్రారంభించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న పాఠశాలను పూర్తిస్థాయిలో ఆయన పరిశీలించారు. ఒక ఎన్జీవో సంఘం సహకారంతో సుమారు 40 లక్షల రూపాయల దీంతో కొన్ని పనులు చేపట్టడానికి ముందుకు వచ్చారని ఇంకా పూర్వ విద్యార్థులు తలుచుకుంటే మనతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పాఠశాలను ఆరు నెలల్లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులు చక్కగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**ఖద్దరు వేసుకునేది కలెక్షన్ల కోసం కాదు: ఎమ్మెల్యే**

రాజకీయాల్లో ఉన్న ప్రతి నాయకుడికి ఒక బాధ్యత ఉంటుంది. ఖద్దరు బట్టలు వేసుకునేది ఖరీదైన కార్లలో షికార్లు చేయడానికో, కలెక్షన్లు చేయడానికి కాదు.. ప్రజల మధ్యన ఉండాలి.. ప్రజా జీవితాన్ని అర్థం చేసుకొని వారి కోసం నిరంతరం పనిచేయాలి.. అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉద్వేగ భరితంగా అన్నారు. పాఠశాలలో సమస్యలను చూసి చలించిన ఆయన ఎన్జీవోలు అందించిన సహకారం, తన సొంత నిధుల ద్వారా పాఠశాలకు సేవలు అందిస్తున్నానని, పూర్వ విద్యార్థులు ముందుకు వస్తే మరింత విస్తృతమైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఎవరు రాకపోయినా ఈ పాఠశాల అభివృద్ధి బాధ్యత తనదేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామీణ పాఠశాలల్లో చదివి అంత ఎత్తుకు ఎదిగాడని, ప్రభుత్వ పాఠశాలల వల్ల నాణ్యమైన విద్య వస్తుందని అది సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి చదువు తన కుటుంబానికి మాత్రమే కాదు.. దేశానికి కూడా ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పాఠశాలలను పటిష్టంగా నిర్మించడం, అక్కడ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం, మంచి ఉపాధ్యాయులను నియమించడం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. గడిచిన పదేళ్లలో గత ప్రభుత్వం విద్యార్థుల కోసం ఏం చేసిందో ఒక్కసారి ప్రశ్నించుకోవాలని అన్నారు. ఫరూక్ నగర్ హైస్కూల్ లో అదనపు తరగతి గదులు నిర్మిస్తామని కూలగొట్టిన గత పాలకులు స్థానిక నాయకుడు ఒకరు మళ్లీ ఈ పాఠశాల బాగోగులు పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిక ప్రాధాన్యత విద్యగా ఇస్తున్నారన్నారు. ఫరూక్ నగర్ పాఠశాల ఎంతో చరిత్ర కలిగిన పాఠశాల అని, ఎంతోమంది మేధావులను ప్రపంచానికి అందించిందని అలాంటి పాఠశాల దుస్థితిలో ఉండటం బాధాకరమని అన్నారు. ఈ పాఠశాలను అన్ని విధాలుగా రూపురేఖలు మార్చి ఉపాధ్యాయులకు కానుకగా ఇస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు..

# స్వశక్తిని చాటండి.. కోటి వెలుగులు అందుకోండి..

**● మహిళలతో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు..ం ● అసెంబ్లీ పరిధిలో 3,418 చెక్కులు అందజేత.. చెక్కుల విలువ 3.29 కోట్లు.. ● మంత్రికి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాపరెడ్డి, నాయకులు.. ● కార్యక్రమానికి హాజరైన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ● జోరుగా.. హుషారుగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం**










ప్రభుత్వం అన్ని రంగాలలో మహిళలకే పెద్ద పీట వేసింది.. ఉపాధి దిశగా వారిని ఉన్నతికి చేర్చేందుకు రంగం సిద్ధం చేసింది.. మహిళలు మీ శక్తిని చాటండి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్దేశించినట్లుగా కోటిని దాటి కోటీశ్వరులుగా వెలుగొందండి.. అంటూ మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. షాద్ నగర్ పట్టణంలోని రెడ్ రోజ్ గార్డెన్ లో మంగళవారం ఇందిరా మహిళా శక్తి కింద 3418 మంది మహిళా సంఘాలకు రూ.3.29 కోట్లు చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైయస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇచ్చి వ్యాపార, కుటీర పరిశ్రమల దిశగా ప్రోత్సహించడం జరిగిందని, ఇప్పుడు మళ్లీ అలాంటి ప్రయోజనం కరమైన పథకాన్ని ఇందిరా శక్తి రూపంలో ప్రభుత్వం ముందుకు తెచ్చిందని గుర్తు చేశారు. మహిళలు విడివిడిగా వ్యాపారాలు చేసి గడ్డి పోచల్లా మిగిలిపోకుండా, కలిసికట్టుగా వ్యాపార రంగంలోకి వెళ్లి గడ్డిమోపులా మారాలని అప్పుడే వారి ఆర్థిక శక్తి బలంగా ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల జీవితాలను మార్చే ప్రయోజనకరమైన పథకాలని కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకువస్తుందన్నారు. ఇందులో భాగంగానే మహిళలను పారిశ్రామిక రంగంలోనూ, వ్యాపార రంగాలలోనూ ముందుకు తీసుకెళ్లాలని దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వెల్లడించారు. మహిళల కోసం గోదాముల నిర్వహణ, క్యాంటీన్లు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, పెట్రోల్ బంకుల నిర్వహణ లాంటి ఎన్నో కార్యక్రమాలను వ్యాపారాల రూపంలో చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది అన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకపోయినా తమ ప్రభుత్వం ప్రజల కోసం, ముఖ్యంగా మహిళల కోసం ఎంతో శ్రమిస్తుందని దీనిని అర్థం చేసుకొని మహిళలు తమకు ఆశీస్సులు అందించాలని పేర్కొన్నారు.

**అప్పులు నెత్తిన రుద్దారు..** గత పాలకులు పదేళ్ల పాలనలో విద్యను పట్టించుకోలేదు, వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేశారు, మహిళల కోసం ఒక్క పథకం కూడా తీసుకురాలేదు.. కానీ కోట్లాది రూపాయలు అప్పులు మాత్రం చేశారని మంత్రి శ్రీధర్ బాబు ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం తీసుకున్న అప్పులకు నెలకు ఏడు కోట్ల రూపాయల చొప్పున మిక్కిలిస్తున్నామని ఇంత చేసిన మహిళలను విస్మరించలేదని గుర్తు చేశారు. పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని దుస్థితి గత ప్రభుత్వానిదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ఈనెల 25 నుంచే కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తుందని స్పష్టం చేశారు. రాబోయే సంవత్సర కాలంలో కోటి మంది మహిళలను సులువుగా కోటీశ్వరులను చేస్తామని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం దశలవారీగా హామీలు నెరవేర్చుకుంటూ వస్తుందని, ఉచిత బస్సు, ఉచిత కరెంటు వంటివి ఇందులో భాగమే అన్నారు. త్వరలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని అన్నారు. తమ ప్రభుత్వం 98 రోజుల్లో 90 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా రూపంలో చెల్లించిందని స్పష్టం చేశారు. అంతకుముందు రైతు రుణమాఫీ కూడా చేయడం జరిగిందని అన్నారు. ప్రజా పాలన ద్వారా ప్రతి ఒక్కరికి పథకాలు వర్తించేలా కృషి చేశామని స్పష్టం చేశారు. షాద్ నగర్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతగానో అభివృద్ధి చేస్తున్నాడని, అతనే నియోజకవర్గ ప్రజల భవిష్యత్తుకు భరోసా అన్నారు. ముఖ్యమంత్రితో కొట్లాడి అభివృద్ధి పనులను సాధించడంలో ఆయన ముందు వరసలో ఉంటారని స్పష్టం చేశారు.

**సోలార్ ప్లాంట్‌లు..** మహిళల కోసం కొత్తగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఈ సోలార్ ప్లాంట్ల ద్వారా ఒక మెగావాటు విద్యుత్ తయారు చేస్తే కోటి రూపాయల వరకు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

**ఇది తథ్యం.. ఇదే సత్యం: ఎమ్మెల్యే** కాంగ్రెస్ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయబోతున్నారు ఇది తథ్యం.. ఇదే సత్యం.. అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అధికారంలోకి రాగానే ఉచిత బస్సులు, ఉచిత కరెంటు, చౌక ధరకు గ్యాస్ వంటి కార్యక్రమాలు మహిళల కోసమే చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పుడు మహిళల కోసం ప్రత్యేకంగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో ప్రయోజనకరమని స్పష్టం చేశారు. తీసుకున్న డబ్బులు సక్రమంగా కడితే తిరిగి రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత కెసిఆర్ పాలనలో మహిళా శక్తి పూర్తిగా నిర్వీర్యమైందని పేర్కొన్నారు. బంగారు తెలంగాణ అని చెప్పి బాతు గుడ్డు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే నాయకులను నమ్మవద్దని, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ ల ఆశయాలకు అనుగుణంగా ముందుకు నడిచే కాంగ్రెస్ పార్టీని మాత్రమే నమ్మాలని స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు వంటి కార్యక్రమాల ద్వారా ఇచ్చిన ప్రతి హామీని సీఎం నెరవేరుస్తున్నాడని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ అన్ని వర్గాల ప్రజల కోసం చాలా కార్యక్రమాలను చేపట్టబోతున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్థానిక నాయకులు మహిళా సంఘాల నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

---

# ఎవరైనా అడ్డొస్తే చంపేస్తా..!

**● దూసకల్ మాజీ సర్పంచ్ చౌలపల్లి మురళీధర్ రెడ్డి బెదిరింపులు ● గౌడ సంఘం సమాధుల తొలగింపు... ● ఈత చెట్లు, తూము కాలువ ధ్వంసం చేశారని గౌడ సంఘం ఆందోళన ● షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో దూసకల్ గ్రామ గౌడ సంఘం ఫిర్యాదు**






ఎవరైనా తనకు అడ్డొస్తే చంపేస్తానని ముత్తాతల నాటి దూసకల్ గౌడ సంఘం సమాధులను ధ్వంసం చేయడమే కాకుండా తమ స్థలంలో ఉన్న ఈత చెట్లు, చెరువు తూము కాలువలను గ్రామ మాజీ సర్పంచ్ చౌలపల్లి మురళీధర్ రెడ్డి బెదిరింపులకు దిగుతున్నాడని ఆరోపిస్తూ గ్రామ గౌడ సంఘం నాయకులు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మంగళవారం దూసకల్ గ్రామానికి చెందిన గౌడ సంఘం నాయకులు సత్యనారాయణ గౌడ్, రామస్వామి గౌడ్, గడిగే ఆంజనేయులు గౌడ్, యాదయ్య గౌడ్, అల్వాల కుమార్ గౌడ్ బూర్గుల బాలయ్య గౌడ్ ఈదులపల్లి విష్ణు గౌడ్, ఈదులపల్లి శ్రీకాంత్ గౌడ్ ఈదులపల్లి అంజయ్య గౌడ్, అల్వాల శేఖర్ గౌడ్, గడిగే ఆంజనేయులు గౌడ్ తదితరులు పెద్ద ఎత్తున తరలివచ్చి పోలీస్ స్టేషన్లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. సదర్ ఫిర్యాదు ప్రతిని మీడియా కార్యాలయాల్లో స్వయంగా వచ్చి అందజేశారు. పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం అదేవిధంగా బాధితులు పేర్కొంటున్న విధంగా.. దూసకల్ గ్రామంలో సర్వేనెంబర్ 81 లో వందల నాటి సంవత్సరాల క్రితం తమ గౌడ సంఘం పెద్దలు ఏర్పాటు చేసుకున్న ఎనిమిది గుంటల పొలంలో గౌడ కులస్తుల సమాధులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ స్థలంలో ఈత చెట్లతో పాటు చెరువు తూము కాలువ కూడా ఉండేదని దీనిని ఈనెల 16వ తేదీన దూసకల్ గ్రామ మాజీ సర్పంచ్ చౌలపల్లి మురళీధర్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా సమాధులతోపాటు వీటిని ధ్వంసం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గడిగే సాయిలు అనే వ్యక్తి సమాధిని కూడా ధ్వసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ విషయం తెలియగానే గ్రామ పెద్దలు సత్యనారాయణ గౌడ్ మరియు అల్వాల దశరథ్ గౌడ్ అలవాల కుమార్ గౌడ్ కొంతమంది కలిసి వెళ్లి మురళీధర్ రెడ్డిని ఎందుకు సమాధులు ధ్వంసం చేశారని, తూము కాలువను పాడుచేసి ఈత చెట్లను నాశనం చేశారని ప్రశ్నించగా అతను స్పందిస్తూ ఏమి చేసుకుంటారో చేసుకోండి నాకు అడ్డు వస్తే చంపేస్తా అని బెదిరించినాడు అని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.గ్రామ పెద్దలు సైతం ఇది మాట్లాడుకుందామని చెప్పినందుకు సంఘటన జరిగిన న్యాయం కోసం గ్రామ పెద్దల కోసం వేచి చూచామని అయినప్పటికీ తమకు న్యాయం జరగని కారణంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పత్రిక కార్యాలయాలకు వాళ్ళు వచ్చి ఫిర్యాదుపరుతులను మీడియాకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌర్జన్యంగా తమను బెదిరిస్తున్నారని తమ తాతల కాలం నాటి సమాధులను దోషం చేయడమే కాకుండా ఈత చెట్లు చెరువు తూము కాలువ చిద్రం చేసి తన పొలంలో కలుపుకున్నాడని వారు ఫిర్యాదు చేశారు. తమకు రక్షణ కల్పించాలని న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు

# రాజకీయాలను వ్యక్తి గతంగా చూడరాదు.

**● హత్య రాజకీయాలకు షాద్ నగర్ లో స్థానం లేదు ● కాంగ్రెస్ నాయకుడు చిలకమర్రి రవీందర్ రెడ్డి ని పరామర్శించిన కేశంపేట మాజీ జెడ్పిటిసి దంపతులు.**



**షాద్ నగర్,ఫరూక్ నగర్,జులై 22:** ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు ఉండాలని,ఎన్నికల తర్వాత అందరం కలసి అభివృద్ధి కోసం కృషి చేయాలని,వ్యక్తి గత కారణాలతో దాడులు చేయడం సరైన విధానం కాదని అన్నారు కేశంపేట మాజి జెడ్పిటిసి సభ్యురాలు,రంగారెడ్డి జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి..ఫరూక్ నగర్ మండలం కాంగ్రెస్ నాయకుడు చిలకమర్రి రవీందర్ రెడ్డి ఇటీవల హత్యాయత్నానికి గురైన కాంగ్రెస్ నాయకుడు చిలకమర్రి రవీందర్ రెడ్డిని ఆయన స్వగృహంలో జెడ్పిటిసి దంపతులు పరామర్శించారు మీడియా ద్వారా మాట్లాడుతూ,,కొంతమంది రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి దాడులకు పాల్పడటం మంచి విధానం కాదని తెలిపారు.సమాజంలో ఇలాంటి దాడులు సరికావని పేర్కొన్నారు.నిందితుల కుట్ర వెనుక ఎవరున్నారో పోలీసులు చేదించి వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని,దీని వెనుక ఉన్న కుట్రను విచ్ఛిన్నం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.చిలకమర్రి రవీందర్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.ఇలాంటి దాడులకు సహకరించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

---

# పెండింగ్ ఫీజురీయంబర్స్ మెంట్స్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి

**● రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ ● ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన..**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కమిటి ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న 8158 కోట్లు స్కాలర్ షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని షాద్ నగర్ ముఖ్య కడలిలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్స్,స్కాలర్ షిప్స్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి ప్రభుత్వాలు అన్నారు. విద్యార్థులకు బకాయిలు విడుదల చేయకపోవడంతో తమ పై చదువుల కోసం సర్టిఫికేట్స్ కోసం కళాశాల యాజమాన్యాల దగ్గరికి వెళితే ఫీజులు కడితే తప్ప సర్టిఫికెట్స్ ఇవ్వలేము అంటున్న పరిస్థితి ఉన్నది. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచిన విద్యార్థులకు ఇవ్వాల్సిన 8158 కోట్ల రూపాయల స్కాలర్ షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ ఇప్పటికీ ఎలాంటి ప్రకటన చేయకపోవడం సిగ్గుచెట్టు అన్నారు. ఒక పక్క కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వం విడుదల చేయకపోతే క్లాసులు నడపాకుండా తరగతుల బహిష్కరిస్తున్న దుస్థితి నెలకొన్నది. దీని ద్వారా విద్యార్థులు తమ క్లాసులు నష్టపోతున్నారు. ఇంత జరుగుతున్న విద్యా వ్యవస్థ పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు అన్నారు. ఒక పక్క తల్లి దండ్రులు ఫీజులు కట్టలేక ప్రభుత్వం స్కాలర్ షిప్స్ విడుదల చేయక విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే ఆపివేస్తు పార్ట్ టైమ్ జాబులు చేసుకుంటున్నారు అని తెలిపారు. జిల్లాలో విద్యార్థులకు దాదాపు 750 కోట్ల రూపాయలు పెండింగ్ ఉన్నాయి. రేవంత్ రెడ్డి గారు విద్యా రంగానికి పెద్ద పీట వేస్తా అన్నారు కానీ ఆచరణలో మాత్రం శూన్యం అన్నారు.నేటికి విద్యా రంగానికి విద్యాశాఖ మంత్రి లేకుండా ప్రభుత్వాన్ని నడుపుతున్న తీరు చూస్తే విద్యా వ్యవస్య పట్ల తమ చిత్త శుద్ధి ఉన్నదో అర్థం అవుతుంది అన్నారు. మాటలే తప్ప చేతల్లో చేసిందేమీ లేదన్నారు. ప్రభుత్వ ఎప్పటికైనా స్పందించి వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పోరాటాలకు పూనుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ టౌన్ అధ్యక్షాకార్యదర్శులు సుమయిర్, శివ శంకర్ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్ మరియు ఎస్ఎఫ్ఐ నాయకులు యూసుఫ్, మజర్, ఆరీఫ్, హర్ష, రెహమాన్, అబ్బు, సుభాన్, ఆరీఫ్, అయాన్, మహేష్, శమి, ఫాయ్యుమ్, వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు..



# మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలు

**తెలుగు వెలుగు ప్రతినిధి శేర్లింగంపల్లి:** నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని ఎలుగెత్తి చాటిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలు ఎల్లమ్మబండలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు దాశరథి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.



తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
బుధవారం, 23 జులై 2025


# మాతాజీ నగర్‌లో ఘనంగా బోనాల వేడుకలు...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** బేగం పేట్ పరిధి లో మాతాజీ నగర్ లోని నల్లపోచమ్మ ఆలయంలో కాంగ్రెస్ నాయకురాలు రాధ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టి పి సి సి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్లు రమేష్ పేర్కొన్నారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక నాయకులు లక్ష్మయ్య, విశాల్ సుధాం, అరుణ్, పర్వేజ్, శివ చౌదరి, మధురి రాము, వాసు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

# జాంగారి రవికి జన్మదిన శుభాకాంక్షలు

**- తెలిపిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి**



తెలంగాణ ఉద్యమ కారుడు, షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, జాంగారి రవి జన్మదినము సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే విర్లపల్లి శంకర్ సమక్షంలో జన్మదిన వేడుకలు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి వర్యులు దుదిల్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే విర్ల పల్లి శంకర్, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శ్యామ్ సుందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణ రెడ్డి, వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తాండ్ర కాశీనాథ్ రెడ్డి,మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీలు విశాల శ్రావణ్ రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, సీనియర్ నేతలు చెంది తిరుపతి రెడ్డి, రఘు నాయక్, అగ్గ నూర్ బస్వం,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజు గౌడ్, జగదీశ్వర్ అప్ప,మండల కాంగ్రెస్ అధ్యక్షులు చల్ల శ్రీకాంత్ రెడ్డి, విరేశ్, రాజు, జంగ నర్సింహులు, కొత్తూరు పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, షాద్ నగర్ పట్టణ అధ్యక్షుడు కొంకల్ల చెన్నయ్య, పురుషోత్తం రెడ్డి, దంగు శ్రీనివాస్ యాదవ్, అందే మోహన్, రాజేష్ గౌడ్, శ్రీను నాయక్ ,ముబరాక్, లింగారెడ్డి గూడ అశోక్ ,వెలి జర్ల యువ నాయకుడు మట్ట వెంకటేష్ గౌడ్ , మంద రాజు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ చైర్పసన్ బీర్ల అనిత ఐలయ్య 50 కిలోల బియ్యం అందచేత

**యాదాద్రి భువనగిరి జిల్లా జూలై 22:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మందనపల్లి గ్రామంలో జంగ ఆమోస్ ఇటీవలే గుండె పోటుతో మరణిం చడం జరిగింది. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది. అనంతరం బీర్ల ఫౌండేషన్ ఛైర్మెన్ బీర్ల అనిత ఐలయ్య వారి కుటుంబానికి భీర్ల ఫౌండేషన్ ద్వారా 50 కిలోల బియ్యం ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా అందజేయడం జరిగింది.మందనపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు యువకులు పాల్గొన్నారు.



# విద్యావ్యవస్థను విధ్వంసం చేశారు..

**● ఆంబోతుల్లా అరుపులు తప్ప చేసింది ఏమీ లేదు.. ● అక్షర కాంతులకే కాంగ్రెస్ తొలి ప్రాధాన్యత.. ● జానంపేట బడికి వెలుగులు తీసుకొస్తా.. ● షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ● రూ. 65 లక్షలతో ఫరూక్ నగర్ హైస్కూల్ అదనపు తరగతి గదులకు శంకుస్థాపన**

విద్యా వ్యవస్థను గత ప్రభుత్వం విధ్వంసం చేసింది.. భవనాలను శిథిలాలుగా మార్చింది.. విద్యార్థుల మేధస్సును నిర్వీర్యం చేసింది.. ఆంబోతుల్లా అరవడం తప్ప గత ప్రభుత్వ పాలకులు చేసింది ఏమీ లేదు.. కానీ కాంగ్రెస్ అక్షర కాంతులకే తొలి ప్రాధాన్యత ఇస్తుంది.. అదే మార్గంలో జానంపేట జడ్.పి.హెచ్.ఎస్ (ఫరూక్ నగర్ హైస్కూల్) ఉన్నత పాఠశాలను కూడా తీర్చిదిద్దుతా.. అంటూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ ఇచ్చారు. ఫరూక్ నగర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపక బృందం స్థానిక ఎంఈఓ మనోహర్ ఆధ్వర్యంలో ఎన్సీసీ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి




ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ.. పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించి నాణ్యత ప్రమాణాలను పెంచాలన్నది ప్రభుత్వం ముందున్న లక్ష్యం అని అన్నారు. అందుకే పాఠశాల భవన నిర్మాణాలు, ఏకీకృత పాఠశాల అభివృద్ధి చేపట్టారని వివరించారు. ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారా వారిని మరో అడుగు ముందుకు వేయించి చక్కని బోధన చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గత పాలకుల పదేళ్ల వైఫల్యం వల్ల నియోజకవర్గంలో బడులన్నీ పాతబడిపోయి, కనీసం ప్రహారీలు కూడా లేని స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తీసుకువచ్చి కొందుర్గులో ఏకీకృత పాఠశాల, మొగిలిగిద్ద పాఠశాల అభివృద్ధి వంటి కార్యక్రమాలు చేయించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ



జూనియర్ కళాశాల ప్రారంభోత్సవాన్ని కూడా స్వయంగా సిఎం రేవంత్ రెడ్డి ద్వారా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గత పాలకులు మన ప్రాంత చారిత్రాత్మక పాఠశాలలపై వివక్ష ప్రదర్శించారు కాలయాపన చేశారు తప్ప ఇక్కడ ఒరగపెట్టింది ఏమీ లేదని విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మనోహర్, ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి తదితర అధ్యాపక బృందం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, నాయకులు కృష్ణారెడ్డి, చేన్నయ్య, శ్రీకాంత్ రెడ్డి, బాలరాజు గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, ముబారక్ అలీ ఖాన్, జమ్రుద్ ఖాన్, మహమ్మద్ ఇబ్రహీం, రఘునాయక్, అందే మోహన్, పాష, మహబూబ్, వీర్లపల్లి అన్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్, మల్లేష్, గ్రంధాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మదన్మోహన్ రెడ్డి, మసూద్ ఖాన్, ముబారక్ అలీ ఖాన్, సీనియర్ ఉర్దూ పాత్రికేయులు మన్సూర్ అలీ ఖాన్, దంగు శ్రీనివాస్ యాదవ్, దిలీప్, గంగ ముని సత్తయ్య, సయ్యద్ ఖదీర్, నక్క బాలరాజు గౌడ్, మంగులాల్ నాయక్, సుదర్శన్ గౌడ్, క్యూసెట్ శీను తదితరులు పాల్గొన్నారు..

# ఫస్ట్ వార్డులో ఫస్ట్ క్లాస్ సౌకర్యాలు

**● షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" ● రూ. 1.62 కోట్లతో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన ● తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, వార్డు ప్రజలు ● ఎమ్మెల్యేను ఘనంగా సంబంధించిన స్థానికులు**

షాద్ నగర్ మున్సిపాలిటీలో ఫస్ట్ వార్డును ఫస్ట్ క్లాస్ గా సౌకర్యాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూక్ నగర్ 1వ వార్డులో రూ.1.62 కోట్ల నిధుల అభివృద్ధితో సిసి రోడ్డు, డ్రైనేజీ పనులకు మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తదితర స్థానిక ప్రజలు నాయకులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఒకటవ వార్డులోని రహీముద్దీన్ ఇంటి నుండి ధర్మయ్య ఇంటి వరకు సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా అబ్దుల్ హకీం ఇంటి నుండి అమృత ఇంటి వరకు సిసి రోడ్డు, అంజద్ ఖాన్ ఇంటి నుండి స్నేహ ఇంటి వరకు మహమ్మద్ కలీం ఇంటి నుండి వెంకట్ గుండు ఇంటి వరకు శిష్యుడు పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా అంతర్గత డ్రైనేజీ నిర్మాణం కోసం రఘు ఇంటి నుండి పుల్లయ్య ఇంటి వరకు, అలాగే బషీర్ అహ్మద్ ఇంటి నుండి నాగులపల్లి రోడ్డు, చంటి హౌస్ నుండి సోహెల్ ఇంటి వరకు రషీద్ ఇంటి నుండి మునవర్ ఇంటి వరకు అంతర్గత డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. గత పది ఏళ్లలో ఒకటో వార్డులో ఎలాంటి అభివృద్ధి పనులు గత పాలకులు చేపట్టలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక స్థానిక నాయకులు ప్రజల ఆకాంక్ష మేరకు సిసి రోడ్డు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ ను స్థానికులు పెద్ద ఎత్తున బ్యాండ్ బాజాలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కూడా కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్, మల్లేష్, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, మొహమ్మద్ ఇబ్రహీం, జమ్రుద్ ఖాన్, బాలరాజు గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి,



పార్లమెంటరీ నాయకులు పురుషోత్తం రెడ్డి, లింగారెడ్డిగూడెం అశోక్, మసూద్ ఖాన్, మన్సూర్ అలీఖాన్, దంగు శ్రీనివాస్ యాదవ్, గ్రంధాల అభివృద్ధికి చైర్మన్ మదన్మోహన్ రెడ్డి, డైరెక్టర్లు సుదర్శన్ గౌడ్, క్యూసెట్ శీను తదితరులు పాల్గొన్నారు..

# తెలంగాణ రాష్ట్ర హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ కార్యవర్గం నియామకం...

**● నోడల్ అధికారిగా కూకట్పల్లికి చెందిన మాలోత్ మహేంద్ర నాయక్...**

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** సెంట్రల్ జాయింట్ సెక్రటరీ మిస్టర్ అతుల్ కుమార్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఎన్నికలు సజావుగా ముగిశాయి. ఎన్నికల నిర్వహణ బాధ్యతను నిర్వాహకులు ప్రతిష్టాత్మకంగా చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు. మహామన మదన్మోహన్ మాల్వి 1928లో భారత దేశంలోని పేద వెనుకబడిన పిల్లలకు స్కౌటింగ్ అర్హత కల్పించాలని సంకల్పంతో హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ప్రారంభించారు. అప్పట్లో అది ఒక సాధారణ సంఘంగా కొనసాగుతున్నా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ అధికారిక గుర్తింపు పొందిన సంఘంగా అభివృద్ధి చెందింది. హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ సంస్థలు మిస్టర్ బద్రీనాథ్ రీజనల్ ఆర్గనైజింగ్ కమిషనర్ అనే కీలక పదవికి నియమితులయ్యారు. ఈ నియామకంతో ఆయనకు తూర్పు తీర రాష్ట్రాలైన తమిళనాడు, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో స్కౌటింగ్ కార్యకలాపాల సమన్వయ బాధ్యతలు అప్పగించబడ్డాయి. తన దీర్ఘ అనుభవం మరియు పరిపక్వతతో మిస్టర్ బద్రీనాథ్ స్కౌటింగ్ ఉద్యమానికి కొత్త ఊపును తీసుకు వస్తారని సంస్థ నమ్మకం వ్యక్తం చేసింది. ఈ ప్రాంతాలలో యువత సామాజిక సేవ కార్యక్రమాలలో మరింత చురుకుగా పాల్గొనేలా ఆయన ప్రణాళికలు రూపొందించనున్నారని తెలియజేశారు. ఆయన నాయకత్వంలో హిందుస్థాన్ స్కౌటింగ్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు మరింత విస్తరించి సమాజంపై సానుకూల ప్రభావం చూపుతాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. సంఘం యొక్క పరిపాలన వ్యవహారాల్లో డాక్టర్ ప్రవీణ్ ను స్టేట్ చీఫ్ కమిషనర్ గా డాక్టర్ సురేష్ ను స్టేట్ సెక్రటరీగా అధికారికంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఇద్దరూ తమ అనుభవంతో సంస్థకు మరింత బలాన్ని చేకూర్చుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో కేంద్రస్థాయిని ప్రతినిధించే బాధ్యతలతో మిస్టర్






మహేందర్ నాయక్ ని నోడల్ అధికారిగా ఎన్నుకోవడం జరిగింది. ఆయన తన గత అనుభవం సంకల్పం సమర్థతను పరిగణలోకి తీసుకొని ఈ పదవికి ఎంపిక చేశారు. ముందున్న కార్యక్రమాల సమన్వయం, కేంద్ర మరియు ప్రాంతీయ విభాగాల మధ్య సమర్థవంతమైన సమాచార ప్రవాహం మరియు పర్యవేక్షణ బాధ్యతలు ఈ నూతన నియామకంతో మరింత బలపడనున్నాయి.

# అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ శేరిలింగంపల్లి

**శేరిలింగంపల్లి సర్కిల్ 20లో చైన్ మెన్ హవా**

**మల్లన్న చూపు ఉంటే అక్రమం సక్రమం అవుతుంది సక్రమం అక్రమం అవుతుంది**

**అడిగింది ఇచ్చుకో...నీకు నచ్చింది చేసుకో...**

**చైన్ మెన్ నుండి  కమిషనర్ వరకు అందరిపై ఆరోపణలు**

**ఇంత దారుణంగా ఎప్పుడు చూడలేమంటున్నా వివిధ కాలనీల సంఘాలు**

**సీఎం సార్ ఈ అక్రమ నిర్మాణాలపై ఒక లుక్కెయ్యండి**



నాటి షెడ్డు నిర్మాణం



నేటి నిర్మాణం షెడ్డు





**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి న్యూస్:** శేరిలింగంపల్లి సర్కిల్ 20 అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలకు హద్దు అదుపు లేకుండా పోతుంది. అక్రమార్కులు ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం నిద్రమత్తులో మునిగిపోతున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలు జరగకుండా చూసుకోవాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తి పడి అక్రమ నిర్మాణాలకు అజ్యం పోస్తున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ లో అనుమతులకు మించి భారీ అక్రమ నిర్మాణం జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శేరిలింగంపల్లి సర్కిల్ 20 పరిధిలో ఏ నిర్మాణం చేపట్టిన అనుమతులు తప్పనిసరి. కానీ అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా టౌన్ ప్లానింగ్ చైన్ మేన్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అండదండలతో అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారు. దీంతో జిహెచ్ఎంసి ఆదాయానికి భారీగా గండి పడుతుంది. అయినప్పటికీ దాన్ని ఆచరించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని మామూళ్లకు అలవాటుపడి వాటిని పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు చేస్తే అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం తప్ప అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుపుతుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు చొరవ తీసుకుని అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, నిర్మాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సర్కిల్ పరిధిలో ఐటీ కారిడార్లోని గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, కొండాపూర్ డివిజన్లు ఉన్నాయి. ఒక్కొక్క డివిజన్ లో సుమారు 300 నుండి 400 వరకు నిర్మాణాలు జరుగుతున్నాయి. అందులో కొన్నిచోట్ల భవనాలకు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నారు. మరికొన్నింటిలో పనులు కొన సాగుతున్నాయి. గతంలోనే కొన్ని నిర్మాణాలు పూర్తి అవగా ఇంకొన్ని మూడు, నాలుగు నెలల క్రితం పనులు మొదలుపెట్టినవే ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన కొందరి దగ్గరి బంధువులు, వారి అనుచరులు అన్నీ తామై ఈ అక్రమ నిర్మాణాల తతంగాన్ని నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వారికి జీహెచ్ఎంసీ అధికారులు పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్రభుత్వంలోని కీలక వ్యక్తులకు ఈ విషయంతో సంబంధం ఉందని, అందువల్లే అధికారులు పట్టించుకోవడం. లేదనే ప్రచారం జరుగుతోంది. శేరిలింగంపల్లి సర్కిల్ జిహెచ్ఎంసి అధికారుల తీరుమారడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమపని తాము చేస్తున్నామని చెప్పుకునే టీపీఎస్ అధికారులు, కింది స్థాయి సిబ్బంది నూతన నిర్మాణాల వద్ద చేస్తున్న హడావుడిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్మాణం వద్దకు వచ్చి ఏదైనా అడిగితే ఇవ్వాల్సిందే.. లేదంటే తాము చెప్పిన వారిని కలిసే వరకు నిర్మాణం చేపట్టవద్దని హుకుం జారీ చేస్తున్నారట. కాదూ కూడదు అంటే లక్షల్లో ఫైన్ కట్టాలంటూ ఇండికేషన్స్ ఇస్తున్నారట. శేరిలింగంపల్లి సర్కిల్ టీపీఎస్ అధికారులు, సిబ్బంది అక్కమార్కులకు కొమ్ము కాస్తూ నిర్మాణదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. శేరిలింగంపల్లి సర్కిల్-20లో చైన్ మెన్, టౌన్ ప్లానింగ్ టిపిఎస్ ఉద్యోగుల హవా కొనసాగుతోంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో వీళ్లే కింగ్ మేకర్లు. సర్కిల్-20 పరిధిలో ఎక్కడ ఏ బిల్డింగ్ కట్టినా..ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా..వీరికి అడిగినంత ఇచ్చుకోవాల్సిందే.కాదు, కుదరదు అంటే కొత్తగా ఒక ఇటుకను కూడా పేర్చనియ్యరు. తట్టేడు సిమెంట్ ను కూడా పోయ్యనివ్వరు. వాస్తవానికి జీహెచ్ఎంసీ పరిధిలో శేరిలింగంపల్లి సర్కిల్-20 నిర్మాణ రంగంలో వేగంగా దూసుకుపోతోంది. ఈ సర్కిల్ పరిధిలో సుమారు 3 నుండి 4 లక్షల వరకు జనాభా ఉంటుంది. ప్రతీ ఏటా కొన్ని వందల భవనాల నిర్మాణాలు జరుగుతుంటాయి. కొండాపూర్ ప్రభు పాద, శేరిలింగంపల్లి, గచ్చిబౌలి సర్కిల్ పరిధిలోనే ఉన్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే లైట్ తీసుకుంటారు. ఒక్కదానికి కూడా ఎలాంటి కనీస అనుమతులు, ఎలాంటి ఫైర్ సేఫ్టీ లేకుండా భారీ భవనాలు నిర్మిస్తున్న ఎవరు అడ్డుకోరు సరికదా దగ్గరుండి మరీ అధికారులే వాటిని పూర్తి స్థాయిలో వారి అధికారాన్ని అడ్డంపెట్టి సంరక్షిస్తుంటారని టాక్. ఇలా మన ఘనత వహించిన జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై సర్వత్ర సొసైటీ మొత్తంలో చర్చనీయాంశం అయ్యింది. సర్కిల్-20 పరిధిలోని భవన నిర్మాణాల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేస్తే ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరే అవకాశాలున్నాయి. ప్రతీ సంవత్సరం వందల కొద్ది భారీ భవన నిర్మాణాలు జరుగుతున్నందున కోట్లల్లో సోమ్ము సర్కార్ ఖజనాకు జమ అయ్యే ఛాన్సుంది. కానీ, ఇక్కడ అలా జరగడం లేదు. సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం మొత్తం నిర్వీర్యం అయిపోయింది. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ప్రతీరోజు అనేక చోట్ల కొత్త భవనాలు, అదనపు బిల్డింగ్స్ నిర్మాణాలు, సెల్లార్ల కన్స్ట్రక్షన్స్ జరుగుతుంటాయి. అయితే ఎక్కడ కొత్త నిర్మాణాలు ప్రారంభ మైనా అక్కడ ఈ ఉద్యోగులు గద్దల్లా వాలిపోవడం అలవాటుగా మారిపోయింది. భవన నిర్మాణ యాజమానులు వీరికి అడిగినంత ఇస్తే కానీ, అస్సలు ఊరుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తు న్నాయి. జీరో పర్మిషన్ కు ఎంత చెల్లించాలి, అదనపు ఫ్లోర్స్ కన్స్ట్రక్షన్ కు ఎంత ముట్టజెప్పాలి..కొత్త భవనాల నిర్మాణాలకు ఎంత చెల్లించాలి అనే విషయాలపై ఓ ధరను నిర్ణయించే స్తున్నారు. ఒకవేళ వీరు చెప్పినంత ఇవ్వకుంటే వెంటనే ఉన్నతాది ,కారులకు సదరు నిర్మాణ యాజమానుల వివరాలను చేరవేసి పనులను నిలిపివేయిస్తున్నారనే విమర్శలున్నాయి. ఫైర్ సెఫ్టీ, సెట్ బ్యాక్, ఇతరత్రా కారణాలు చెప్పి నిర్మాణాలు నిలుపు దల చేయిసున్నారు. ఈ విషయంలో టౌన్ ప్లానింగ్ ఉద్యోగులకు పై స్థాయి ఉన్నతాధికారుల నుంచి అండదండలు పుష్కలంగా అందుతున్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు ఇచ్చిన సపోర్టు తోనే ఈ అవినీతి తిమింగలాలు రెచ్చిపోతున్నట్లు సమాచారం. రోజు వారిగా బిల్డింగ్ నిర్మాణ యాజమానుల దగ్గర వసూల్ చేసుకొచ్చిన అవినీతి సోమ్మును పై అధికారులకు వారి వారి స్థాయిలను బట్టి ఎవరి ముల్లే వారికి అప్పజెబుతున్నట్లు తెలుస్తోంది.

# అలై బలై కార్యక్రమానికి ఆహ్వానం



**కూకట్ పల్లి జూలై 22 :-** ఎస్ సి, ఎస్ టి, బీసీ, మైనారిటీల వర్గీకరణ కోసం, అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు, బడుగు, బలహీన, పీడిత వర్గాల పక్షాన నిలబడిన నాయకుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ కి సన్మానం కార్యక్రమం ఓల్డ్ బోయిన్పల్లి మల్లారెడ్డి గార్డెన్స్ లో నిర్వహిస్తున్న అలై బలై కార్యక్రమానికి రావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికను కూకట్ పల్లి బిజెపి పార్టీ ఇన్చార్జ్ మాధవరం కాంతారావు తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ, శేర్లింగంపల్లి నియోజకవర్గం బీసీ సంఘం అధ్యక్షులు పుట్ట శివశంకర్, బిసి సంఘ నాయకులు వెంకట నరసింహ రావు, నాగమల్లేశ్వర రావు, టైలర్ మల్లేష్. కే.రాఘవేంద్ర చారి తదితరు బీసీ నాయకులు అందరిని తీసుకొని రావాలని ఆహ్వానించడం జరిగింది.ఈ సందర్భంగా తెల్ల హరికృష్ణ మాట్లాడుతూ రాజకీయాలకు కులాల మతాలకు అతీతంగా జరిగే ఈ కార్యక్రమానికి ఎస్ సి, ఎస్ టి, బీసీ, మైనారిటీ సోదర, సోదరీమణులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలియజేశారు.

# విత్తన శుద్ధి ద్వారా మొక్కల్లో చీడపీడలను నివారించవచ్చు: ఏవో నాగమణి




**రామాపురం జులై 22:-**విత్తన శుద్ధి ద్వారా మొక్కల్లో చీడపీడలను నివారించవచ్చు అనిఏవో నాగమణి అన్నారు రామాపురం మండలంలోని కసిరెడ్డి గారి పల్లి యూనిట్ లోని కసిరెడ్డిగారిపల్లి వివో లో పలు పంటలు కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఖరిఫ్ సీజన్ లో విత్తన సమయంలో గంగరాజు అనే రైతు కు 3.00 విస్తీర్ణంలో బీజామృతం తో విత్తన శుద్ధి తో పాటు పలు పంటలు వేపించడం,అలాగే ప్రతి ఒక్కరూ విత్తన శుద్ధి తప్పకుండాచేసుకోవడం వల్ల మొక్కలకు వచ్చే రకరకాల వ్యాధులను నివారించవచ్చని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విహెచ్ఎ హరిత యూనిట్ ఇన్చార్జి హరికృష్ణ సుధాకర రెడ్డి కిరణ్ కుమార్ సురేంద్ర శ్రీనివాసులు ఎన్ఎఫ్ఐలు తదితరులు పాల్గొన్నారు

# లోకేష్ అన్నా రహదారి మరమ్మతులు చేయించరూ



**మంగళగిరి జూలై 22:-**మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి లోని యర్రబాలెం అంబటి నగర్ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారి గుంతల్లో వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో స్థానిక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వర్షపు నీరు నిలువడంతో ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ లేదో తెలియక ఒక్కోసారి వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. ఈ రహదారి మార్గం గుండానే అంబటినగర్, శ్రీరామనగర్ కాలనీలోకి స్థానిక ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈనేపథ్యంలో అంబటి నగర్ ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో స్థానిక ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల రహదారికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి తమ ఇబ్బందులను తీర్చాలని స్థానిక కాలనీవాసులు నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ను కోరుతున్నారు.

# మున్సిపల్ కార్మికుల సమ్మె ఆగస్టు 3 వరకు తాత్కాలిక వాయిదా

**రాయచోటి జూలై 22:-** మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బీవీ రమణ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్షులు కార్యదర్శి అక్బర్ శంకరయ్య లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట 10 రోజు సమ్మె సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల మనోభావాలకనుగుణంగా జీతాలు అరకొర పెంచి124 జీ ఓ విడుదల చేసినప్పటికీ వేతనాలు ఇప్పటి నుండి పెంచుతున్నారో వివరాలు జి ఓ లో లేనందున మరియు సంక్షేమ పథకాలు ఊసే పేర్కొనలేదని , మున్సిపల్ రాష్ట్ర ముఖ్య అధికారులు ఆగస్టు 3 వరకు అందుబాటులో లేనందున సమ్మెను ఆగస్టు 3 లోపల వేతనాలు పెంపు లో స్పష్టత, ఇతర డిమాండ్ల అమలు జరగకపోతే మళ్ళీ నిరవధిక సమ్మె కొనసాగిస్తామని అప్పటివరకు సమ్మె ను తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కమిటి తెలిపిందన్నారు. కార్మికులు ఐక్య సంఘటన వలనే ప్రభుత్వం జీవో 124 విడుదల చేసిందని మానవహారం తో ముగించారు రేపు ఉదయం 5 గంటలకు విధులకు హాజరువుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు



# హంద్రీనీవా సుజల స్రవంతి ఫేస్ వన్ ఫేస్ టు పనులకు 3,873 కోట్ల రూపాయలు నిధులు

**● కుప్పం పరిశీలకులు గాజుల ఖాదర్ భాష**



**రాయచోటి జులై 22:-**జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రాజెక్టుల విషయంలో రాయలసీమకు పూర్తిగా అన్యాయం జరిగిందని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు మంగళవారం నాడు మంత్రి రాంప్రసాద్ రెడ్డి క్యాంపు కార్యాలయం నందు ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..హంద్రీనీవా ప్రాజెక్టును 1996 మార్చి 11వ తేదీన ఉమ్మడి రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారని తెలిపారు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమను సస్యశ్యామలం చేసే విధంగా నాలుగు జిల్లాల రైతాంగానికి ఉపయోగపడే విధంగా హంద్రీనీవా స్రవంతి ప్రాజెక్టును ఫేస్ వన్.. ఫేస్ టు గా రూపొందించడం జరిగిందని తెలిపారు 13635 కోట్ల రూపాయలు వరకు పరిపాలన అనుమతులు కూడా ఇవ్వడం జరిగింది అని తెలిపారు దాదాపుగా 11535 కోట్ల రూపాయల వరకు టిడిపి ప్రభుత్వమే హంద్రీనీవా ప్రాజెక్టు ఖర్చు చేయడం జరిగింది అని తెలిపారు 2014 2019 సంవత్సరంలో హంద్రీనీవా ప్రాజెక్టుకు 4182 కోట్లు ఖర్చు చేసి 80 శాతం వరకు పనులు పూర్తి చేయడం జరిగింది అని తెలిపారు కాల్వ విస్తీర్ణాన్ని కూడా పది మీటర్ల నుంచి 16.5 మీటర్లు వెడల్పు చేసి 40 టి ఎం సి ఇలా నీరు తరలించే విధంగా తెలుగుదేశం ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు టిడిపి ప్రభుత్వం 2014... 2019 వసంవత్సరంలో 12441 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే వైసిపి ప్రభుత్వం కేవలం 2011 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేయడం జరిగింది జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే హంద్రీనీవా ప్రాజెక్టు ఫేస్ వన్ కింద మిగిలిన పనులు పూర్తి చేస్తానన్న హామీని జగన్ విస్మరించారని చెప్పారు జగన్ హయంలో బిల్లులు రాక పనులు కూడా ఎక్కడికక్కడే ఆగిపోయాయని 7.6. 2021వ తేదీన ఒక చీకటి జీవో నెంబర్ 30 ద్వారా 1977 కోట్ల రూపాయలకు అంచనాలు పెంచుకొని దోచుకునే ప్రయత్నం చేశారని తెలిపారు కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ఫేస్ టు ఫేస్ వన్ కి 3,873 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని చెప్పారు ఫేస్ వన్ కింద 198000 ఎకరాలకు మరియు ఫేస్ టు కింద 404500 ఎకరాలకు రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో ఆరు లక్షల 2500 ఎకరాలకు సాగునీరు లభిస్తుందని తెలిపారు మొత్తం 81 మండలాల్లో 33 లక్షలు మందికి తాగునీటి సరఫరా కు అవకాశం లభిస్తుందనితెలిపారుఈ సమావేశంలో మాజీ సర్పంచ్ నాగేశ్వర్ నాయుడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ బుజ్జి తెలుగుదేశం పార్టీ నాయకులు బసిరెడ్డి శివారెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


**● డా కె.వేణుగోపాల్,సెట్కూరు సీఈఓ**

**దేవనకొండ జూలై 22:-** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెట్కూరు సీఈఓ డా. కె.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్కూరు ఆధ్వర్యంలో దేవనకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల, లో మత్తు పదార్థాల వ్యసనం-పర్యవసానాలు అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో సెట్కూరు సీఈఓ డా. కె.వేణుగోపాల్ మాట్లాడుతూ తోటి వారి ప్రోద్బలంతో కానీ, మానసిక ఒత్తిడుల ప్రభావం వల్ల కానీ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని తెలిపారు. దుర్మార్గుల స్వార్థం తో చాటు మాటు దారులు దాటుకుని పాఠశా లలు, కళాశాలలకు మత్తుపదార్థులు విస్తరిస్తున్నాయని, మత్తు పదార్థాలు మొదట్లో ఆనందం, సంతోషం వంటి భావనలు ప్రేరేపించి ఆనంద డోలికల్లో తేలేలా చేస్తాయని వీటి ప్రభావం తగ్గగానే మనసును తీవ్ర ఆందోళనలతో కుదుపేసి మరల తీసుకునేంత వరకు కుదురుగా నిలబడనీయవన్నారు.డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్ఫలితాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ తో వివరించారు.డ్రగ్స్ నోటి ద్వారా తీసుకుంటే జీర్ణాశయం, కాలేయం దెబ్బతింటాయి. పొగ ద్వారా తీసుకునే వాటితో ఊపిరితిత్తులు, గుండె దెబ్బతింటాయి. ఇంజక్షన్ల ద్వారా తీసుకుంటే హైపటైటిస్, హెచ్ ఐ వి వంటి రోగాలు వచ్చే అవకాశం ఉంది. కావున మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు.ఇన్స్పెక్టర్ విశ్వనాధ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు మనిషిని మానసికంగా, శారీరకంగా పూర్తిగా లోబర్చుకొని, మనిషి ప్రవర్తనను, నడవడికను మార్చి భవిష్యత్తును పూర్తిఅంధకారం చేస్తాయని వీటిని కొనటానికి నేరాలు చేయడం జరుగుతుందని తెలిపారు. మీ పరిసరాలలో మత్తు పదార్థాల అమ్మడం జరిగిన, తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటి నివారణకు ఈగల్ అనే ప్రత్యేక పోలీస్ విభాగాన్ని ఏర్పాటు చేసి మత్తుపదార్థాల నివారణకు కృషి చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులకు దిశ యాప్ గురించి తెలియ చేశారు ఆప్ ను డౌన్లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.తదుపరి కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శర్మ గారు మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని, వారి ప్రవర్తనను గమనిస్తూ ఎప్పటికప్పుడు జాగ్రత్తలు




తీసుకోవాలని, ఏదైనా సందేహం ఉంటె వెంటనే తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సెట్కూరు పర్యవేక్షకులు శ్యాంబాబు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

# లోకాయుక్త జోక్యంతో పోలవరం నిర్వాసిత కుటుంబాలకు న్యాయం




**కర్నూలు జూలై 22:-** లోకాయుక్త జోక్యంతో పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి క్రింద నిర్వాసిత కుటుంబాలకు న్యాయం జరిగింది.పోలవరం ప్రాజెక్టు పునఃనిర్మాణం మరియు పునః నిర్మాణ ప్యాకేజీ కింది నిర్వాసితులకు సరైన పరిహారం అందజేయడం ద్వారా పౌరుల హక్కులను పరిరక్షించడంలో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త, మరియు ఉప-లోకాయుక్త సంస్థ మరోసారి కీలక పాత్ర వహించింది.పోలవరం ప్రాజెక్టు క్రింద ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి ప్రయోజనాల నుండి తమను మినహా ఇంచటంపై శ్రీమతి నల్లాల వెంకట రమణమ్మ మరియు శ్రీ నల్లాల శేషగిరి దాఖలు చేసిన ఫిర్యాదు నెంబర్లు 61/2019/బి1 మరియు 62/2019/బి?లలో ఫిర్యాదిదారుల నివాసాలు ప్రభావిత ముంపు ప్రాంతంలో ఉన్నప్పటికీ, ఫిర్యాదివారిని లబ్దిదారుల జాబితాలో చేర్చకపోవటం విషయంలో లోకాయుక్త సంస్థ జోక్యం తరువాత ప్రాజెక్టు నిర్వాహకుడు, మరియు ఎక్స్ ఆఫిషియో జాయింట్ కలెక్టర్, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, ధవళేశ్వరం వారు ఫిర్యాదిదారులను సప్లమెంటరీ డ్రాఫ్ట్ ఆర్ అండ్ ఆర్ పథకంలో చేర్చారని, మరియు ఫిర్యాదిదారులకు ఇంటిస్థలం కేటాయింపుతో పాటు రూ.6,36,000/- లు మరియు రూ.25,000/- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి క్రింద చెల్లించబడిందని నిర్ధారిస్తూ, చర్య తీసుకున్నారని వేదికను సమర్పించారు. ముఖ్యంగా కుమ్మరిలోవ గ్రామం, తుని మండలంలోని అన్ని ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల ప్రయోజనం కోసం ప్రభుత్వం రూ.9.50 కోట్లు మంజూరు చేసింది. ఈ ఫిర్యాదు వలన ఫిర్యాదిదారులతో పాటు ఇతర ప్రభావిత కుటుంబాలకు కూడా ప్రయోజనాలు అందించబడ్డాయి. ఫిర్యాదిదారుల సమస్య పరిష్కరింపబడటంతో శ్రీమతి పి.రజని గౌరవ ఉప-లోకాయుక్త ఈ ఫిర్యాదును మూసివేస్తూ, ఉత్తర్వులు జారీ చేశారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బలహీన వర్గాల హక్కులను కాపాడటంలో మరియు పునరావాస విధానాల పారదర్శకతను అధికారులు అమలు చేయటంలో లోకాయుక్త మరియు ఉప-లోకాయుక్త సంస్థ కీలక ప్రభావాన్ని ఈ కేసు నొక్కి చెబుతుంది.

# ప్రమాదం జరిగితే తప్ప- పట్టించుకోరా..?

**● చూసి చూడనట్టు,విద్యుత్ అధికారులు**

**బొమ్మనహాల్ జూలై 22:-** మండల పరిధిలోని,శ్రీధరగట్ట గ్రామంలోని,ముస్లిం ఖలందర్ ఇంటి,వైపు నుండి,దాదాపుగా,25 కుటుంబాల,ఇంటి పై,వరకు విద్యుత్ తీగలు,వేలాడి ఉన్నాయని,పొరపాటున చెయ్యి పైకెత్తితే,ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఎక్కువ ఉందని, అధికారులకు తెలియజేసి కూడ,ఈ యొక్క వేలాడి ఉన్న విద్యుత్ తీగలను,అందనంత ఎత్తులో లేదా,వేరొక చోటికి, లాగమని, పలుమార్లు విద్యుత్ అధికారులకు, మరియు గ్రామంలో ఉన్న,లైన్ మాన్,తో,పలు మార్లు మొరపెట్టుకున్న కూడా,ఎక్కడ వేసిన గగ్గోలి అక్కడే అన్న, చందంగా,చూసి చూడనట్టుగా కాలయాపన చేస్తూ,ప్రజల ప్రాణాలతో, చెలగాటమాడుతున్నారని,ఆ చుట్టు ప్రక్కల ఉన్న ప్రజలు, వాపోతున్నారు,ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందిస్తూ, ప్రమాదం జరగముందే,ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా, వెంటనే ఈ యొక్క విద్యుత్ తీగలను,వేరొక దగ్గరికి మార్చవలసిందిగా,ప్రజలు కోరుతున్నారు,



బుధవారం,
23 జులై 2025

తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం



# శేషప్రశ్నగా ధన్‌ఖడ్ రాజీనామా వ్యవహారం!

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే..అనూహ్యంగా భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ రాజీనామా చేయడం సహజ ంగానే ఆశ్చర్యాన్ని కలిగించడమే కాకుండా... అనుమా నాలను రేకెత్తించింది. బెంగాల్ గవర్నర్‌గా ఆయన పనితీరును ప్రశంసించిన మోడీ అనూహ్యంగా ఆయనను ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారు. వెంకయ్యనాయుడు పదవీకాలం ముగియగానే పొడిగించవెూ లేదా..రాష్ట్రపతిగా ప్రమోషన్ ఇవ్వడమో జరుగుతుందని అంతా అనుకున్నారు. అయితే అవేవీ జరగలేదు. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత అన్నీ అనూహ్యాలే జరుగుతున్నాయి. అద్వానీని రాష్ట్రపతిని చేస్తారని అంతా భావించారు. బిజెపి శ్రేణులు గట్టిగా నమ్మారు. కానీ రామ్‌నాథ్ కోవింద్‌ను తెరపైకి తెచ్చి అద్వానీని అవమానించారు. ఈ దేశానికి ప్రధాని కావాలని గట్టిగా నమ్మి పార్టీ కోసం కృషి చేసిన అద్వానీకి మోడీ అడ్డుపడ్డాడు. ఆతరవాత రాష్ట్రపతిని చేస్తారని అనుకుంటే...అప్పుడు కోవింద్ తెరపైకి వచ్చారు. ఇక అద్వానీ శకం ముగిసింది. మురళీమనోహార్ జోషి శకం ముగిసింది. పాతతరంలో రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు మాత్రమే ఇప్పుడు మోడీ ప్రభుత్వంలో ఉన్నారు. వెంకయ్యనాయుడును పార్టీ నుంచి తప్పించే క్రమంలో ఉపరాష్ట్రపతిని చేసి, ఆ తరవాత ఆయనను ఇంటికే పరిమితం చేశారు. ఇప్పుడు ధన్‌ఖడ్ రాజీనామా కూడా అనూహ్యమే అయినా మోడీ వ్యూహం ఉండేవుంటుంది. పార్లమెంటు ప్రారంభంకావడం, తొలిరోజే అనూహ్యంగా విపక్షాలు వివిధ అంశాలపై చర్చకు పట్టుబట్టడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎందుకు రాజీనామా చేశారన్న ప్రశ్న ఉదయిస్తోంది. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజీనామాను ఆమోదించారు. ఈ మేరకు ఫైల్‌పై సంతకం చేశారు. కాగా, గత రాత్రి అనూహ్యంగా జగదీప్ ధన్‌ఖర్ తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో పదవి నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. కానీ, ఈ రాజీనామాకు అసలు కారణం అనారోగ్యం కాదని పలువురు రాజకీయ నేతలు అంటున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేయడంఇప్పుడు



రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఉపరాష్ట్రపతి రాజీనామాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. ఉపరాష్ట్రపతి సహా వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసేందుకు ధన్‌ఖడ్‌కు అనేక అవకాశాలు లభించాయ న్నారు. ఆయన మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు- పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎందుకిలా అన్న చర్చ సాగుతోంది. 2022లో ఎన్డీయే తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు.విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వీవీ గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్ వెంకటరామన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖఢ్ రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాలలో ఆసక్తికరంగా మారింది.ఓ న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభించడం, కేంద్ర ప్రభుత్వంతో వివాదం, రాజ్యసభలో జరిగిన కొన్ని సంఘటనలు దన్‌కడ్ రాజీనామా వెనక ఉన్నాయని చెబుతున్నారు. ఈ నిర్ణయం ప్రస్తుతం దేశ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ యశ్వంత్ వర్మ అనే న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభ్యం కావడంతో ఈ వివాదం మొదలైంది. ఈ సంఘటన తర్వాత విపక్ష పార్టీలు రాజ్యసభ లో జస్టిస్ వర్మను తొలగించేందుకు ఒక నోటీసును ప్రవేశపెట్టాయి. రాజ్యసభ అధ్యక్షుడిగా ఉన్న జగదీప్ ధన్‌ఖర్ ఈ నోటీసును ఆమోదించి, రాజ్యసభ కార్యదర్శికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ చర్య కేంద్ర ప్రభుత్వానికి నచ్చలేదని తెలుస్తోంది. విపక్షాలు ప్రవేశపెట్టిన ఈ నోటీసును ఆమోదించడం ద్వారా, న్యాయవ్యవస్థలో అవినీతిపై కేంద్రం నేరుగా చర్యలు తీసుకునే అవకాశాన్ని ధన్‌ఖర్ తప్పించారని కేంద్రం భావించినట్లు సమాచారం. ఈ విషయంపై కేంద్రంతో విభేదాలు వచ్చాయని పుకార్లు కూడా వచ్చాయి. ఈ సంఘటన తర్వాత ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చే ప్రయత్నాలు మొదల య్యాయని తెలిసింది. ఆరు నెలల క్రితం కూడా విపక్షాలు ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చాయి. అయితే, ఈసారి కేంద్రం నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా, ధన్‌ఖర్ అవమానకరమైన అవిశ్వాస తీర్మానానికి బదులు రాజీనామా చేయడాన్ని ఎంచుకున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని సోమవారం రాత్రి 9:25 గంటలకు ఉప రాష్ట్రపతి అధికారిక ఎక్స్ ఖాతాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖను పోస్ట్ చేశారు. తన ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడానికి, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ) ప్రకారం రాజీనామా చేస్తున్నట్లు- లేఖలో తెలిపారు. ఇది వెంటనే అమల్లోకి వచ్చేలా భారత ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. ఈ క్రమంలో తన పదవీ కాలంలో సహకరించిన వారికి ధన్‌ఖడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, ప్రధానమంత్రి, రాజ్యసభ సభ్యులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఇవన్నీ బయటకు కనిపిస్తున్న కారణాలే అయినా ఇంకా ఇతరత్రా ఏ కారణాలు ఉన్నాయన్నది కాలక్రమంలో తెలుస్తుంది. అయితే ధన్‌ఖడ్ మోడీకి ఇష్టమైన వ్యక్తిగా అనూహ్యంగా దూసుకుని వచ్చి..అంతే అనూహ్యంగా రాజీనామా చేసి వెళ్లిపోవడమనే చర్య మాత్రం అనుమానాలను రేకెత్తిస్తూనే ఉంటుంది.

# ధన్‌ఖడ్ రాజీనామాపై రాజకీయ చర్చ

**● అనూహ్య రాజీనామాకు కారణాలపై ఆరా ● లోతైన కారణాలు ఉంటాయని జైరామ్ రమేశ్ అనుమానం**

**న్యూఢిల్లీ,జూలై22:** ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఎవరికి తోచిన విధంగా వారు విశ్లేషణలు చేస్తున్నారు. ఇంత సడన్‌గా ఎందుకు రాజీనామా నిర్ణయం తీసుకున్నారని ఆరా తీస్తున్నారు. ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామాపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేసింది. అనారోగ్య కారణాలతో వైదొలుగుతున్నట్లు ఆయన చెప్పినప్పటికీ.. అది కారణం కాకపోవచ్చని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ధన్‌ఖడ్ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బిజినెస్ అడ్వైజరీ కమిటీకి అధ్యక్షత వహించారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రి కిరణ్ రిజిజుతో సహా పలువురు దీనికి హాజరయ్యారు. చర్చ అనంతరం సాయంత్రం 4.30కు మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. అయితే, మరోసారి భేటీకి రిజిజు, నడ్డా రాలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ధన్‌ఖఢ్ మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా



వేశారు. దీన్ని బట్టి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4.30 మధ్య ఏదో పెద్ద విషయమే జరిగిందని జైరామ్ రమేశ్ అనుమానం వ్యక్తం చేశారు. రిజిజు, నడ్డా ఉద్దేశపూర్వకంగానే సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈక్రమంలోనే ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ధన్‌ఖఢ్ ప్రకటించారు. ఆరోగ్య కారణాల దృష్ట్యా ఇలా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దాన్ని మనం గౌరవించాలి. కానీ, అందుకు చాలా లోతైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోందని రమేశ్ రాసుకొచ్చారు. తన పదవీకాలంలో రైతుల సంక్షేమంపై ధన్‌ఖఢ్ నిర్భయంగా మాట్లాడేవారని రమేశ్ పేర్కొన్నారు. ప్రజాజీవితంలో న్యాయపరమైన జవాబుదారీతనం, సంయమనం గురించి గట్టిగా మాట్లాడారన్నారు. ఆయన నిబంధనలు, ప్రొటోకాల్‌కు కట్టుబడి ఉన్నారన్నారు. సోమవారం పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైన సంగతి తెలిసిందే. తొలి రోజు కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ధన్‌ఖఢ్ రాత్రి అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. ఈ క్రమంలోనే ఆయన వైదొలగాలని నిర్ణయించుకోవడం అనుమా నాలను కలిగిస్తోంది. ధన్‌ఖడ్ రాజీనామాతో రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ- ఛైర్మన్‌గా ఉన్న జేడీయూ నేత హరివంశ్ నడిపించనున్నారు.ఉదయం నుంచి ఎగువసభను సజావుగా నడిపించిన ఆయన రాత్రికి తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ముర్ముకు పంపారు. దీంతో ఆయన రాజీనామాపై ప్రస్తుతం తీవ్రంగా చర్చ నడుస్తోంది. అనారోగ్య కారణాలతో పదవి నుంచి దిగిపోతున్నట్లు- ధన్‌ఖడ్ చెప్పినప్పటికీ.. ఆయన రాజీనామాపై ప్రతిపక్ష పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆరోగ్య కారణాలతోనే పదవి నుంచి దిగిపోతున్నట్లు- చెప్పారని.. దాన్ని మనం గౌరవించాలని జైరాం రమేష్ వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా ఆయన రాజీనామా వెనుక ఏదో లోతైన కారణమే ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

# రేడియో శ్రోతలకు గుర్తుండిపోయే చిత్తరంజన్



**విజయవాడ,జూలై22:** తన సలలిత రాగ సుధారసంతో ఓ తరాన్ని మైమరిపించిన స్వరనిధి డా. మహాభాష్యం చిత్తరంజన్. ఆయన మరణించి రెండేళ్లు అవుతోంది. అయితే పాతతరం వారికి ముఖ్యంగా రేడియో విన్న వారికి చిత్తరంజన్ చిరపరిచితుడు. ఓ రకంగా రేడియోకు ప్రాహుఖ్యం తగ్గడంతో పాటు అలాంటి వారంతా వెళ్లిపోడం వెలితిగా అనిపించింది. రేడియో వింటూ అదే మహదానందంగా మురిసి పోయిన నిన్నటి తరానికి - సరళమైన, మధురమైన లలిత సంగీతపు రుచి చూపించిన స్వరమాంత్రికుడు చిత్తరంజన్. చిత్తరంజన్ రెండేళ్ల క్రితం జూలై 21న పరపదించారు. కూర్చోలేని పరిస్థితిలో కూడా ఆయన పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఎనిమిదేళ్ల ప్రాయంనుంచే అప్పటి నిజాం ఆధీనంలోని దక్కన్ రేడియోలో పాడటంనుంచి, బాలమురళీకృష్ణగారి శిష్యరికంలో ఆయనతో కచేరీల్లో పాల్గొన్న రోజుల్నుంచి, రేడియోలో చేరి తేటతేట తెలుగు పదాల సుమధుర లలిత సంగీత బాణీలతో ఆబాలగోపాలాన్ని మైమర పించిన రోజులనుండి, ఎందరెందరికో గాయనీగాయకులుగా మరోజన్మ ఇచ్చిన మహానుభావుడాయన. సంగీత కుటుంబంలో జన్మించి, లలిత సంగీతాన్నే ఊపిరిగా చేసుకొని ఇక తన గాత్ర మాధుర్యాన్ని అందించారు. నేటి విపరీత పోకడల సంగీతపు హోరులో వారి పంచిన స్వర రుచి ఎంతకమ్మనో ఈ తరానికి తెలియకపోవచ్చు. కాని ఆయన ఎన్నో ఆపాత మధురమైన బాణీలు రేడియో రోజులనాటి తరానికి సాక్షులమైన వారి చెవులలో ఇప్పటికీ గింగురుమంటాయి. చిత్తరంజన్ అంటేనే తెలుగు రేడియో అన్నంతగా ఆయన మైమరపించారు. ఓ రకంగా చెప్పాలంటే ఆధునిక సోషల్ మీడియా, టీవీలు అగ్రభాగాన ఉన్నా.. ఆనాటి రేడియో కార్యక్రమాలే ఎంతో మిన్న అన్నట్లుగా ఉండేవి. అలా అవి ప్రజాదరణ పొందడానికి చిత్తరంజన్ లాంటి వారు ఎందరో కృషి చేశారు. ఆయనకునివాళిగా తెలుగువారు గుర్తుంచుకునేందుకే ఈ ప్రయత్నం.

# ధన్‌ఖడ్ స్థానంలో ఎవరని చర్చ

**● రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌పై దృష్టి**

**● బీహార్ ఎన్నికల నేపథ్యంలో కలసివచ్చే ఛాన్స్**

**న్యూఢిల్లీ,జూలై22:** ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. మరో రెండేండ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ ఆయన కుర్చీని ఖాళీచేశారు. ఆరోగ్య కారణాలను పేర్కొంటూ రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. ఈనేపథ్యంలో తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. అధికార పార్టీ పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు- తెలుస్తున్నది. బీజేపీతోపాటు- ఎన్డీయే పక్షాలకు చెందిన నేతనూ ఈ పదవి దక్కనుందని సమాచారం. ఈ నేపథ్యంలో జనతాదళ్ (యునై-టెడ్) ఎంపీ, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. త్వరలో బీహార్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అదే రాష్ట్రానికి చెందిన హరివంశ్‌ను ఇందుకు ఎంపిక చేసే అవకాశం ఉందని అంటున్నారు. రాజకీయంగా అ అవకాశాన్ని మోడీ ఉపయోగించుకునే తీరుతారని అంటున్నారు. బీహార్‌కు చెందిన హరివంశ్‌కు రాజకీయాలలో అనుభవజ్ఞునిగా పేరున్నది. ఉన్నత విద్యావంతుడిగా పేరుపొందారు. ఆయన తొలిసారి 2014లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆర్థికశాస్త్రంలో పీజీ చేసియ న ఆయన జర్నలిజ్యంలో డిప్లొమా అందుకున్నారు. రాజకీ యాల్లోకి రాకముందు చాలా ఏండ్లు జర్నలిస్టుగా పనిచేశారు. ప్రభుత్వ బ్యాంకులో ఉద్యోగం వచ్చినప్పటికీ జర్నలిజంపై మక్కువతో 'ధర్మయుగ్'లో సబ్ ఎడిటర్‌గా కెరీర్ ప్రారంభించారు.



రవివర్, ప్రభాత్ ఖబర్ వంటి ప్రముఖ ప్రింట్ మీడియా సంస్థల్లో పనిచేశారు. ప్రభాత్ ఖబర్‌కు చీఫ్ ఎడిటర్‌గానూ వ్యవహరించారు. మాజీ ప్రధాని చంద్రశేఖర్‌కు సలహాదారుగా పనిచేసిన ఆయన.. ఆ ప్రభుత్వం కూలిపోవడంతో మళ్లీ జర్నలిజంలోకి వచ్చేశారు. నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) నుంచి తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 2020 నుంచి రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండనుండటంతో హరివంశ్‌నే ఉపరాష్ట్రపతిగా ఎన్డీయే ప్రభుత్వం నియమించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

# టెస్టు క్రికెట్ చరిత్రలో సంచలనం

## సంచలన మార్పులకు సిద్ధమైన ఐసీసీ

## 12 జట్లతో రెండు గ్రూపులుగా విభజించి టెస్టులు

## డబ్ల్యూటీసీ 2027- 29 నుంచి అమలయ్యే అవకాశం

## ఈ ఏడాది చివరకల్లా పూర్తి స్థాయి నిర్ణయం



టెస్టు క్రికెట్ చరిత్రలో ఐసీసీ సంచలన మార్పులకు సిద్ధమైంది. 12 జట్లతో రెండు గ్రూపులుగా విభజించి టెస్టులు నిర్వహించాలని యోచిస్తోంది. జై షా నేతృత్వంలో సింగపూర్ వేదికగా జరిగిన సమావేశంలో ఐసీసీ టెస్టు క్రికెట్‌పై దృష్టి పెట్టింది. సంజోగ్ గుప్తా నేతృత్వంలోని వర్కింగ్ గ్రూప్ ఈ ఏడాది చివరినాటికి సిఫార్సులు చేయనుంది. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు డివిజన్-1లో ఉండే అవకాశం ఉంది. రాబోయే మూడు వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌కు ఇంగ్లండ్ ఆతిథ్యం ఇవ్వనుంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 133 ఏళ్ల టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యంత విప్లవాత్మక మార్పు దిశగా అడుగులు వేస్తోంది. టెస్టు క్రికెట్‌ను రెండు గ్రూపులుగా విభజించేందుకు ఒక వర్కింగ్ గ్రూప్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఐసీసీ ఛైర్మన్ జై షా , సీఈఓ సంజోగ్ గుప్తా నేతృత్వంలో జరిగిన తొలి వార్షిక సర్వసభ్య సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. ఎనిమిది మంది సభ్యులతో కూడిన వర్కింగ్ గ్రూప్ ఈ ఏడాది చివరి నాటికి ఐసీసీకి సిఫార్సులు సమర్పించనుంది. మొత్తం 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించనున్నారు. అందులో ఒకదాంట్లో ఆరు, మరోదాంట్లో ఆరు లెక్కన రెండు డివిజన్లుగా విభజించి టెస్టు క్రికెట్ ఆడించనున్నారు. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో ప్రస్తుతం తొమ్మిది జట్లు మాత్రమే పాల్గొంటున్నాయి. డబ్ల్యూటీసీ 2027-29 సైకిల్ నుంచి రెండు గ్రూపులు ఆడనున్నాయి. ఐపీఎల్ బ్రాడ్‌కాస్టర్ జియోస్టార్ నుంచి ఇటీవల ఐసీసీకి వచ్చిన సంజోగ్ గుప్తా ఈ వర్కింగ్ గ్రూప్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నాడు. ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు సీఈఓ రిచర్డ్ గోల్డ్, ఆస్ట్రేలియా క్రికెట్ సీఈఓ టాడ్ గ్రీన్బర్గ్ కూడా ఈ కమిటీలో సభ్యులుగా ఉండటం విశేషం. ఈ రెండు డివిజన్ల విషయం కూడా 2024 జనవరిలో మహిళల యాషెస్ సిరీస్ సమయంలో క్రికెట్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు మధ్య చర్చల్లో వచ్చిందే. ముఖ్యంగా ఆస్ట్రేలియా ఈ కొత్త ఫార్మెట్‌కు ఎక్కువ ఆసక్తి చూపుతోంది. భారత్, ఇంగ్లండ్ ఆస్ట్రేలియా జట్లతో మూడు సంవత్సరాలకు రెండు సార్లు ట్రై సిరీస్ ఆడించేలా కూడా ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ ప్రకారం భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో పాటు దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక జట్లు డివిజన్ -1లో ఉండే అవకాశం ఉంది. డివిజన్ -2లో పాకిస్తాన్, వెస్టిండీస్, బంగ్లాదేశ్‌తో పాటు ఐర్లాండ్, అఫ్ఘనిస్తాన్, జింబాబ్వే జట్లు డివిజన్ -2లో ఉండనున్నాయి. అయితే ఈ ప్రతిపాదన ముందుకు వెళ్లాలంటే 12 ఐసీసీ ఫుల్ మెంబర్స్‌లో 2/3వ వంతు మద్దతు కచ్చితంగా కావాలి. సింగపూర్ వేదికగా జరిగిన ఈ సమావేశంలో రాబోయే మూడు వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌కు ఇంగ్లండే ఆతిథ్యం ఇవ్వనున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. రానున్న డబ్ల్యూటీసీ ఫైనల్ భారత్‌లో నిర్వహించాలని కోరినప్పటికీ అది నెరవేరలేదు. ఈ సమావేశంలోనే టీ20 ఛాంపియన్స్ లీగ్/ వరల్డ్ క్లబ్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌పై కూడా చర్చలు జరిగినా ఇంకా పూర్తి స్థాయిలో అధికారిక ప్రతిపాదన రాలేదు.

# తుది జట్టులోకి లియామ్ డాసన్

ఇంగ్లండ్, భారత్ జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా నాల్గో టెస్టు ఈనెల 23న (బుధవారం) మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో ప్రారంభం కానుంది. ఇప్పటికే సిరీస్‌లో 2-1 ఆధిక్యంలో ఉన్న ఇంగ్లండ్, ఈ మ్యాచ్‌లో విజయం సాధించి సిరీస్‌ను సంపాదించుకోవాలని ఆశిస్తోంది. ఈ లక్ష్యంతోనే తన తుది జట్టులో కీలక మార్పులు చేసింది. గత మ్యాచ్‌లో గాయపడిన స్పిన్నర్ షోయబ్ బషీర్ స్థానంలో లియామ్ డాసన్‌ను ఎంపిక చేసింది. ఎనిమిదేళ్ల విరామం అనంతరం డాసన్ టెస్టు జట్టులోకి రీ ఎంట్రీ ఇవ్వడం గమనార్హం. అతను చివరిసారిగా 2017లో నాటింగ్‌హామ్ వేదికగా దక్షిణాఫ్రికాతో టెస్టు ఆడగా, 2016లో భారత్‌కి వ్యతిరేకంగా చెన్నైలో తన టెస్టు అరంగేట్రం చేశాడు.ఇప్పటి వరకు మొత్తం మూడు టెస్టులు ఆడిన డాసన్, 7 వికెట్లు తీశాడు. బ్యాటింగ్ లో 66 పరుగులు చేశాడు. గత కొన్నేళ్లుగా టీ20 లీగ్‌ల్లో రాణిస్తున్న అతడు, ఇప్పుడు టెస్టు వేదికపై భారత్ బ్యాటర్లను ఎంతవరకు బెంబేలెత్తిస్తాడో చూడాలి. ఇక ఫోర్త్ టెస్టు కోసం ఇంగ్లండ్ ప్రకటించిన తుది జట్టు:జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జేమీ స్మిత్ (వికెట్ కీపర్), లియమ్ డాసన్, క్రిస్ వోక్స్, బ్రైడాన్ కార్సే, జోఫ్రా ఆర్చర్.



# మాంచెస్టర్‌లో టెస్ట్‌లో బుమ్రా ఆడతాడా..?



బుధవారం భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య నాలుగో టెస్ట్ ప్రారంభం కానుంది. అయితే కీలక ఆటగాళ్లు గాయపడటంతో టీమిండియా తుది జట్టు ఎంపికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బుమ్రా ఆడతాడా లేడా ఆకాశ్ దీప్ గాయం నుంచి కోలుకున్నాడా తుది జట్టు ఎలా ఉండబోతుంది అనే ప్రశ్నలు అభిమానులకు తలెత్తుతున్నాయి. అయితే మాంచెస్టర్ టెస్ట్‌కు ముందు మాట్లాడిన భారత పేసర్ మహమ్మద్ సిరాజ్ .. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాడు. ఈ టెస్టులో బుమ్రా ఆడతాడా లేడా అన్న ప్రశ్నపై అటు టీమ్ మేనేజ్‌మెంట్ గానీ, కెప్టెన్, కోచ్ ఎవరూ స్పందించలేదు. కానీ మీడియాతో మాట్లాడుతూ సిరాజ్ తనకు తెలియకుండానే అప్‌డేట్ ఇచ్చేశాడు. బుమ్రా మాంచెస్టర్ టెస్టులో తప్పకుండా ఆడతాడని చెప్పుకొచ్చాడు. ఈ విషయంలో ఎలాంటి అనుమానం అవసరం లేదని స్పష్టం చేశాడు. ఇదే సమయంలో గాయపడ్డ ఆకాశ్ దీప్ పూర్తిగా కోలుకున్నాడా లేడా అన్న ప్రశ్నకు సైతం సిరాజ్ బదులిచ్చాడు. అతడు ఇప్పుడిప్పుడే మళ్లీ బౌలింగ్ చేస్తున్నాడని.. ఫిజియోలు పరీక్షించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పాడు. పిచ్, జట్టు అవసరాల దృష్ట్యా మాంచెస్టర్ టెస్ట్‌కు తుది జట్టు ఎంపిక ఉంటుందని సిరాజ్ అన్నాడు. కాగా నితీశ్ కుమార్ రెడ్డి గాయంతో దూరం కాగా.. అతడి ప్లేసులో శార్దూల్ ఠాకూర్ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఆకాశ్ దీప్ ప్లేసులో అన్షుల్ కాంబోజ్‌ను ప్లేయింగ్ లెవెన్‌లోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. కరుణ్, సాయి సుదర్శన్‌లలో ఒకరు తుది జట్టులో ఉండనున్నారు. జులై 23న మధ్యాహ్నం 3.30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.**నాలుగో టెస్ట్ కోసం భారత జట్టు ఇదే..** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైశ్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ, ఆకాశ్ దీప్, కుల్‌దీప్ యాదవ్, అన్షుల్ కాంబోజ్.

# భారత్ మమ్మల్ని చూసి భయపడుతోంది

## • హ్యారీ బ్రూక్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు



భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య నాలుగో టెస్ట్ మ్యాచ్ బుధవారం ప్రారంభం కానుంది. ఈ టెస్ట్ సిరీస్‌లో ఇంగ్లాండ్ జట్టు 2-1 ఆధిక్యంలో ఉంది. అయితే ఇంగ్లాండ్ ఆటగాళ్లు ఎప్పటిలాగే భారత ఆటగాళ్లను రెచ్చగొట్టే విధంగా టెస్ట్ మ్యాచ్‌లు ప్రారంభం కావడానికి ముందే మాట్లాడటం భారత అభిమానులను ఆగ్రహానికి గురిచేసింది. ఇంగ్లాండ్ జట్టులో దూకుడుగా ఆడే ఆటగాడిగా పేరున్న హ్యారీ బ్రూక్.. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'ఇండియా మమ్మల్ని చూసి భయపడుతుంది' అని అన్నాడు. నాలుగో టెస్ట్‌కు ముందు ఈ వ్యాఖ్యలు భారత్ అభిమానుల్లో ఆగ్రహాన్ని రేపుతున్నాయి.ఈ విషయంపై హ్యారీ బ్రూక్ మాట్లాడుతూ.. "ఇకపై మేము మంచి పిల్లల్లా మైదానంలో ప్రవర్తించం. క్రికెట్ గౌరవాన్ని కాపాడాలని మేము ప్రయత్నించాం. కానీ భారత ఆటగాళ్లు మా జట్టు ఆటగాళ్లను టార్గెట్ చేసి దాడి చేశారు. దాన్ని మేము డ్రెస్సింగ్ రూమ్ నుంచి చూశాం. దీని తర్వాత మరుసటి రోజు మేము ఏమి చేయాలో నిర్ణయించుకున్నాం. చివరి ఇన్నింగ్స్‌లో భారత్ వైపు దూసుకుపోవాలని నిర్ణయించుకున్నాం. మా ప్రవర్తన కారణంగా భారత జట్టు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. అది తక్కువ స్కోరైనప్పటికీ, పిచ్ బ్యాటింగ్ చేయడానికి కష్టంగా ఉంది. దీని వల్ల భారత ఆటగాళ్లు నిలబడలేక తమ వికెట్లు కోల్పోయారు. దీని ద్వారా మేము గెలిచాం. ఈ సిరీస్‌లో మేము ఆడే అన్ని మ్యాచ్‌లు చివరి రోజు, చివరి గంట వరకు వెళ్తున్నాయి. చాలా మంది మమ్మల్ని ఈ సిరీస్ చాలా అద్భుతంగా ఉందని అభినందిస్తున్నారు." అని హ్యారీ బ్రూక్ పేర్కొన్నారు. "నాతో మాట్లాడిన చాలా మంది వారు చూసిన వాటిలో లార్డ్స్ మ్యాచ్ అత్యుత్తమమైనది అని చెప్పారు. కాబట్టి మిగిలిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల కోసం మేము చాలా ఎదురుచూస్తున్నాం. క్రికెట్‌లో ఎప్పుడూ మైదానంలో 11 మంది ఆటగాళ్లకు, ఇద్దరు ఆటగాళ్లకు మధ్యే పోరాటం. ఇలాగే క్రికెట్ పెరిగింది. రెండో టెస్ట్ మ్యాచ్‌లో ఇండియా మాకు చాలా పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించింది. దీనికి కారణం మమ్మల్ని చూసి వారు భయపడటమే. మేము చాలా పెద్ద లక్ష్యాన్ని చేరుకోగలమని వారు భావించారు. ఇది మాకు అనుకూలంగా మారింది. దీని ద్వారా మా ఆత్మవిశ్వాసం పెరిగింది" అని హ్యారీ బ్రూక్ చెప్పాడు.

# ఆసక్తికరమైన గణాంకంలో ముందున్న జడేజా, కేఎల్ రాహుల్



భారత్-ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో భారత జట్టులో కీలక ఆటగాళ్లుగా ఉన్న రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ ఒక ఆసక్తికరమైన గణాంకంలో ముందున్నారు. ప్రస్తుత భారత టెస్ట్ జట్టులోని ఆటగాళ్లలో ఇంగ్లాండ్‌పై అత్యధిక టెస్టు పరుగులు సాధించిన జాబితాలో ఈ ఇద్దరు టాప్-2లో నిలిచారు. ఇది వారిద్దరి నిలకడైన ప్రదర్శనకూ, ఇంగ్లాండ్ గడ్డపై వారి పోరాట పటిమకూ నిదర్శనం. భారత టెస్ట్ జట్టులో రవీంద్ర జడేజా కేవలం బౌలర్‌గా మాత్రమే కాకుండా, బ్యాటింగ్‌లోనూ తన విలువను నిరూపించుకుంటున్నారు. ముఖ్యంగా గత కొన్ని సిరీస్‌లుగా అతను బ్యాటింగ్‌లో అద్భుతమైన ఫామ్‌ను కనబరుస్తున్నాడు. ఇంగ్లాండ్‌పై జడేజా టెస్టుల్లో నిలకడగా పరుగులు సాధిస్తూ వస్తున్నాడు. దిగువ ఆర్డర్‌లో వచ్చి జట్టుకు ఎన్నో కీలకమైన పరుగులు అందించాడు. అతని బ్యాటింగ్ టెక్నిక్, ఒత్తిడిలో నిలబడే సామర్థ్యం ప్రశంసనీయం. ప్రస్తుత ఇంగ్లాండ్ సిరీస్‌లో కూడా జడేజా బ్యాట్‌తో చాలా కీలకమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్టులో, భారత దేశం విజయం కోసం 193 పరుగులు ఛేదించాల్సి ఉండగా, 112 పరుగులకే 8 వికెట్లు కోల్పోయినప్పుడు, జడేజా ఒంటరి పోరాటం చేసి 61 పరుగులు (నాటౌట్) సాధించాడు. ఇది అతని పోరాట పటిమకు నిదర్శనం. ఇంగ్లాండ్ గడ్డపై 1000 టెస్ట్ పరుగులు పూర్తి చేయడానికి జడేజా కేవలం 58 పరుగుల దూరంలో ఉన్నాడు, తద్వారా సర్ గార్ఫీల్డ్ సోబర్స్ తర్వాత ఈ ఘనత సాధించిన రెండో బ్యాట్స్‌మెన్‌గా నిలుస్తాడుకేఎల్ రాహుల్ గత కొన్నేళ్లుగా భారత టెస్ట్ జట్టులో కీలకమైన ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ఓపెనర్‌గా, మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్‌గా అతను తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నాడు. ఇంగ్లాండ్‌పై రాహుల్ టెస్టుల్లో అద్భుతమైన రికార్డును కలిగి ఉన్నాడు. ముఖ్యంగా ఇంగ్లాండ్ గడ్డపై అతని బ్యాటింగ్ చాలా మెరుగు పడింది. బంతిని ఆలస్యంగా ఆడటం, సరైన షాట్ ఎంపిక చేసుకోవడం అతని బలాలు. ప్రస్తుత ఇంగ్లాండ్ సిరీస్‌లో కూడా రాహుల్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటికే రెండు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీతో 375 పరుగులు సాధించాడు. ఇంగ్లాండ్‌లో టెస్టుల్లో 1000 పరుగులు సాధించిన నాల్గవ భారతీయుడిగా నిలవడానికి కేఎల్ రాహుల్ కేవలం 11 పరుగుల దూరంలో ఉన్నాడు. గతంలో సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, సునీల్ గవాస్కర్ మాత్రమే ఈ మైలురాయిని చేరుకున్నారు. నిజానికి, ఈ ఇద్దరు ఆటగాళ్లు ప్రస్తుత టీం ఇండియా జట్టులో ఇంగ్లాండ్ పై అత్యధిక టెస్ట్ పరుగులు చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో టాప్-2లో ఉన్నారు. అదే సమయంలో, రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ కూడా అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. కాబట్టి మాంచెస్టర్ టెస్ట్ తర్వాత ఈ జాబితాలో ఏ ఆటగాడు ముందుకు వస్తాడో చూడటం ఆసక్తికరంగా ఉంటుంది. ప్రస్తుతం, రవీంద్ర జడేజా ఇప్పటివరకు ఇంగ్లాండ్ పై 1358 పరుగులు చేశాడు. ఇది అతన్ని ఈ జాబితాలో అగ్రస్థానానికి తీసుకువచ్చింది. అతని తర్వాత, కేఎల్ రాహుల్ 1330 పరుగులతో రెండవ స్థానంలో ఉండగా, రిషబ్ పంత్ (1206 పరుగులు), శుభ్మాన్ (1199 పరుగులు), యశస్వి జైస్వాల్ (945 పరుగులు) కూడా ఈ జాబితాలో ఉన్నారు. మాంచెస్టర్ టెస్ట్‌లో, ఇద్దరు ఆటగాళ్ళు ఈ రికార్డును తమ సొంతం చేసుకోవాలని చూస్తున్నారు. తన ఆల్ రౌండ్ సామర్థ్యానికి ప్రసిద్ధి చెందిన జడేజా, ఈ జాబితాలో తన ఆధిక్యాన్ని బలోపేతం చేసుకోవడానికి ముందుకు వస్తాడు. అదే సమయంలో, కేఎల్ రాహుల్ ఇటీవల బ్యాటింగ్‌లో మెరుగుపడటం, అతని సంయమనంతో కూడిన ఆట అతన్ని ఈ రేసులో బలమైన పోటీదారుగా చేస్తుంది. మాంచెస్టర్‌లో రాహుల్ జడేజాను వెనుక బడి ఉంచుతాడా లేదా జడేజా నంబర్-1గా ఉంటాడా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తు న్నారు. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ చెరో 300 కి పైగా పరుగులు సాధించారు. రాహుల్ 3 మ్యాచ్‌లలో 6 ఇన్నింగ్స్‌లలో 375 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 1 హాఫ్ సెంచరీ ఉన్నాయి. అదే సమయంలో, రవీంద్ర జడేజా 3 మ్యాచ్‌లలో 6 ఇన్నింగ్స్‌లలో 327 పరుగులు చేశాడు. ఈ సమయంలో, అతను వరుసగా 4 హాఫ్ సెంచరీలు కూడా చేశాడు. ఇటువంటి పరిస్థితిలో, టీం ఇండియా సిరీస్‌లో తిరిగి రావాలంటే, ఈ ఇద్దరు ఆటగాళ్ల బ్యాట్‌లు బాగా రాణించడం చాలా ముఖ్యం.



# శ్రీలీలకు తోడుగా రాశీఖన్నా చేరిక

## ఉస్తాద్ భగత్ సింగ్‌లో మరో హీరోయిన్

పవన్ కల్యాణ్ ,హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా అప్‌డేట్స్ కోసం పవన్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారికి ఈ టీమ్ ఓ అప్‌డేట్‌ను అందించింది. ఇందులో శ్రీలీలతో పాటు మరో కథానాయిక కూడా ఉన్నట్లు– తెలుపుతూ పోస్టర్‌ను పంచుకుంది. ఉస్తాద్ భగత్‌సింగ్'లో నటి రాశీఖన్నా భాగమైనట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పుడీ విషయాన్నే దర్శక నిర్మాతలు అధికారికంగా ప్రకటిస్తూ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో ఆమె 'శ్లోక' పాత్రలో కనిపించనున్నట్లు వెల్లడించారు. తన పాత్రతో సినిమాకు మరింత అందాన్ని తెస్తుందన్నారు. ప్రస్తుతం ఆమె షూటింగ్‌లో పాల్గొంటున్నట్లు– చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో శ్రీలీల భాగమవగా ఇప్పుడు రాశీ కూడా ఇందులో నటిస్తుండడం మరింత ఆసక్తిగా మారింది. గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్, హరీశ్ శంకర్ కాంబోలో రూపొందుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇకపోతే పవన్ నటించిన 'హరి హర వీరమల్లు' జులై 24న విడుదల కానుంది. ఈసందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పవన్ లుక్‌కు అందరూ ఫిదా అయ్యారు. దీనిపై ఓ అభిమాని పోస్ట్ పెట్టగా.. దానికి హరీశ్ శంకర్ సరదాగా రిప్లై ఇచ్చారు. పవన్ ఉస్తాద్ లుక్ అదిరిపోయింది. ఓ అభిమానిగా హరీశ్ శంకర్ ఆయన్ని అద్భుతంగా చూపించనున్నారని అర్థమవుతోందని పోస్ట్ పెట్టారు. దీనికి దర్శకుడు రిప్లై ఇస్తూ.. 'తరతరాలుగా.. నరనరాల్లో ఆయనపై అభిమానం ఉప్పొంగుతోంది' అని అన్నారు.

# ఎన్టీఆర్ కోసం కథం సిద్ధం చేస్తున్న బాబీ

టాలీవుడ్ యంగ్ దర్శకుడు బాబీ బ్యాక్ టు బ్యాక్ హిట్స్‌తో స్టార్ దర్శకుడిగా మారుతున్నాడు. ఈ ఏడాది ఆరంభంలో నందమూరి బాలకృష్ణతో డాకు మహారాజ్ ను డైరెక్ట్ చేసిన బాబీ సూపర్ హిట్ అందుకున్నాడు. ముఖ్యంగా బాబీ గత సినిమాల కంటే డాకు మహారాజ్ ను టెక్నీకల్ గా, విజువల్ గా అద్భుతంగా తెరకెక్కించాడనే పేరు తెచుకున్నాడు. అటు చిరుకు వాల్తేర్ వీరయ్య, ఇటు బాలయ్యకు డాకు మహారాజ్ తో సీనియర్ హీరోలను బాబీ బాగా హ్యాండిల్ చేయగలడు అని నిరూపించాడు. డాకు మహారాజ్ వచ్చి దాదాపు ఆరు నెలలు దాటుతోంది. చిరుతో మరో సినిమా చేయబోతున్నాడు అని ఆ మధ్య టాక్ వినిపించింది. కానీ చిరు ఇతర సినిమాలతో బిజీగా ఉన్నాడు. అలాగే బాలయ్యతో కూడా మరో సినిమా చేయబోతున్నాడని కూడా టాక్ కూడా ఉంది. గోపీచంద్ మలినేనితో బాలయ్య చేయబోతున్న సినిమా తర్వాత బాబీ సినిమా ఉండే ఛాన్స్ ఉంది. అయితే ఇప్పుడు మరొక న్యూస్ టాలీవుడ్‌లో హాల్ చల్ చేస్తోంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ కోసం దర్శకుడు ఓ కథ రెడీ చేస్తున్నాడట. ఈ సినిమా పూర్తిగా అవుట్ అండ్ అవుట్ హై యాక్షన్ గా ఉండబోతుందట. డాకు మహారాజ్ లోని యాక్షన్ ఎపిసోడ్స్ కు విశేషమైన ఆదరణ లభించింది. ఇప్పుడు అంతే స్థాయి హై యాక్షన్ తో పవర్ఫుల్ స్టోరీ రాస్తున్నాడట బాబీ. గతంలో వీరి కంబోలో వచ్చిన జై లవ కుశ సూపర్ హిట్ గా నిలిచింది. వరుస సినిమాలను లైన్ లో పెట్టిన బాబీతో సినిమాను ఎప్పుడు చేస్తాడనేది ఇప్పుడు చర్చ.







# 'అవతార్ 3' సూపర్ అప్‌డేట్

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులను కట్టిపడేయగల సత్తా ఉన్న దర్శకుడు జేమ్స్ కామెరూన్. ఆయన దర్శకత్వంలో 2009 సంవత్సరంలో వచ్చిన అవతార్ సినిమాను అప్పట్లో అద్భుతం, మహా అద్భుతం అనుకోవడం జరిగింది. 2022లో అంతకు మించి అన్నట్లుగా అవతార్ 2 తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఆయన అవతార్ కోసం సృష్టించిన ప్రపంచంను ప్రేక్షకులు మరోసారి ఆస్వాదించారు. మరో వరల్డ్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అవతార్ 2 దక్కించుకున్న విషయం తెల్సిందే. అవతార్ 2 తో పాటు అవతార్ 3 ని సైతం జేమ్స్ కామెరూన్ ప్రకటించిన విషయం తెల్సిందే. 2022లో అవతార్ 2 రాగా, 2025 లో అవతార్ 3 రానున్నట్లు ప్రకటించారు. అవతార్ 2 ను 2022, డిసెంబర్ 16న విడుదల చేయడం జరిగింది. అవతార్ 3 సినిమాను 2025, డిసెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. ఈ విషయాన్ని మరోసారి అధికారికంగా ప్రకటిస్తూ అవతార్ 3 కొత్త పోస్టర్‌ను దర్శకుడు జేమ్స్ కామెరూన్ విడుదల చేశారు. అవతార్ సినిమా ట్రైలర్ ను ఈనెలలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. అవతార్ 3 సినిమా యొక్క మొదటి ట్రైలర్‌ను హాలీవుడ్ మూవీ 'ది ఫెంటాస్టిక్ ఫోర్ : ఫస్ట్ స్టెప్స్' సినిమాతో రిలీజ్ చేయబోతున్నారు. ట్రైలర్ ను ఈ సినిమా స్క్రీనింగ్‌కు ముందు ప్రదర్శించబోతున్నట్లుగా హాలీవుడ్ వర్గాల ద్వారా తెలుస్తోంది. అవతార్ 3 ట్రైలర్ అంచనాలను మించి ఉంటుందని తెలుస్తోంది.

# తెలుగు రాష్ట్రాల్లో పండుగ వాతావరణం

పవన్ కళ్యాణ్‌కి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. టాలీవుడ్‌లో అత్యధిక ఫ్యాన్ బేస్ ఉన్న హీరోల జాబితాలో పవన్ కళ్యాణ్ ముందు వరుసలో ఉంటాడు. పైగా పవన్ ఫ్యాన్స్ యావరేజ్ ఏజ్ 25 ఏళ్ల నుంచి 30 ఏళ్లు అని చెప్పుకోవచ్చు. అందుకే ఆయన సినిమా విడుదల కాబోతుంది అంటే రచ్చ మామూలుగా ఉండదు. ఆయన నుంచి సినిమా వచ్చి చాలా కాలం అయింది. ఆయన రాజకీయాల్లో బిజీ కావడం, ఆ తర్వాత ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకోవడం వంటి కారణాల వల్ల సినిమాలు ఆలస్యం అవుతూ వచ్చాయి. నాలుగు.. ఐదు ఏళ్ల క్రితం ప్రారంభం అయిన ఈ సినిమాలను పవన్ కళ్యాణ్ ఇప్పుడు పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు రెడీ అయ్యారు. క్రిష్ దర్శకత్వంలో మొదలైన హరిహర వీరమల్లు సినిమా ఆలస్యం కావడంతో దర్శకుడి చేతులు మారింది. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో పూర్తి అయిన ఈ హరిహర వీరమల్లు సినిమాను జులై 24న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. మరో రెండు రోజుల్లో సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో టికెట్ల రేట్ల విషయంలో ఒక క్లారిటీ వచ్చింది. అడ్వాన్స్ బుకింగ్స్ మొదలు అయ్యాయి. పవన్ ఎప్పుడూ లేనిది ఈ సినిమా విషయంలో చాలా నమ్మకంగా మాట్లాడుతున్నారు. ఎప్పుడూ సినిమా ప్రమోషన్‌లో భాగంగా మీడియా ముందుకు రాని పవన్ కళ్యాణ్ ఈసారి మీడియాతో మాట్లాడాడు, ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కూడా చాలా గట్టిగానే తన వాయిస్‌ను సినిమా గురించి వినిపించారు. పవన్ మాటలతో రెచ్చి పోయిన ఫ్యాన్స్ ఫస్ట్ డేను ఎంజాయ్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లను అలంకరించే పని ఇప్పటికే ప్రారంభం అయ్యింది. క్వింటాల్స్ లో పేపర్స్‌ను థియేటర్‌లలో జల్లేందుకు గాను అభిమానులు ఇప్పటికే కట్టింగ్స్ రెడీగా పెట్టుకున్నారు. అంతే కాకుండా భారీ కటౌట్‌లు, హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఇలా చెప్పుకుంటూ పోతే తెలుగు రాష్ట్రాల్లో



సినిమా విడుదల కాబోతున్న థియేటర్ల వద్ద పండుగ వాతావరణం ఇప్పటికే ప్రారంభం అయింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లు గత రెండు మూడు నెలలుగా మినిమం ప్రేక్షకులు లేక పోవడం వల్ల మెయింటనెన్స్ లేకుండా ఉన్నాయి. ఇప్పుడు వాటి దుమ్ము దులిపేందుకు యాజమాన్యాలు సిద్ధం అవుతున్నాయి.


# మేఘాలాయ ఘటన ఆధారంగా మూవీ

## ర్యూమర్లను ఖండించిన అమీర్ బృందం

సితారే జమీన్ పర్ విజయం తర్వాత బాలీవుడ్ మిస్టర్ ఫర్‌ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన తదుపరి ప్రాజెక్ట్‌గా మేఘాలయ 'హనీమూన్ మర్డర్ కేసు' ను తీయబోతున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. కొత్తగా పెళ్లయిన రాజా రఘువంశీ హత్యకు గురికావడం, అతని భార్య సోనమ్ ఈ కేసులో నిందితురాలిగా ఉండటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ సంఘటన ఆధారంగా ఆమిర్ ఖాన్ ఒక క్రైమ్ థ్రిల్లర్ నిర్మించేందుకు ఆసక్తిగా ఉన్నారని, కేసు వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నారని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలన్నీ అవాస్తవాలని ఆమిర్ ఖాన్ తన టీమ్ ద్వారా స్పష్టం చేశారు. మేఘాలయ హత్య కేసు ఆధారంగా తాను ఎటు–వంటి సినిమాను తెరకెక్కించడం లేదని ఆమిర్ తెలిపారు. మరోవైపు ఆమిర్ ఖాన్ ప్రస్తుతం తన నిర్మాణ సంస్థలో పలు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఇప్పటికే తన కొడుకుతో ఎక్‌దిన్ చిత్రాన్ని నిర్మిస్తున్న ఆయన తమిళ దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో కలిసి ఒక సూపర్ హీరో సినిమా చేయనున్నారు. ఇది 2026 ద్వితీయార్థంలో షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అలాగే 'మహాభారతం' అనే తన డ్రీమ్ ప్రాజెక్ట్‌పై కూడా పనిచేస్తున్నారు.

--------------

# సన్ ఆఫ్ సర్దార్ 2.. ట్రైలర్ విడుదల




బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం సన్ ఆఫ్ సర్దార్ 2. విజయ్ కుమార్ అరోరా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మృణాల్ థాకుర్ కథానాయికగా నటించబోతుంది. రాజమౌళి దర్శకత్వంలో సునీల్ హీరోగా వచ్చిన మర్యాద రామ సినిమాను హిందీలో సన్ ఆఫ్ సర్దార్ అని రీమేక్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఇదే సినిమాకు సన్ ఆఫ్ సర్దార్ 2 అంటూ సీక్వెల్‌ను తీసుకువస్తున్నారు మేకర్స్. ఇప్పటికే ఫస్ట్‌లుక్‌తో పాటు– – ట్రైలర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే ఈ సినిమాను మొదటగా జూలై 25న విడుదల చేయబోతున్నట్లు– ప్రకటించిన చిత్రబృందం అనుకోని కారణాల వలన వారం వాయిదా వేసింది. దీంతో ఈ చిత్రం జూలై 31న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు– ప్రకటించింది. ఈ సందర్భంగా మూవీ నుంచి కొత్త ట్రైలలర్‌ను పంచుకుంది.

# కోపాన్ని వదిలేయమన్న రజనీ: మోహన్ బాబు



రజనీకాంత్ తనకు బెస్ట్ ఫ్రెండ్ అని నటుడు మోహన్‌బాబు చెప్పారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన రజనీకాంత్‌తో తనకున్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా తమ మధ్య అనుబంధం ఉందని తెలిపారు. రజనీకాంత్ గొప్ప వ్యక్తిత్వం ఉన్న మనిషి. మా ఇద్దరి మధ్య 50 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. నేను అతడిని 'ఏయ్ బ్లడీ తలైవా' అని ముద్దుగా పిలుస్తాను. మా మధ్య అంత చనువు ఉంది. 50 ఏళ్ల క్రితం మా వద్ద ఏమీ లేనప్పుడు నటులుగా పరిచయం కాకముందు మద్రాసు ప్లాట్‌ఫామ్‌పై మొదటిసారి కలుసుకున్నాం. అప్పటినుంచి మా బంధం కొనసాగుతోంది. రోజులో కనీసం 3, 4 సార్లైనా మెసేజ్ చేసుకుంటాం. ఇటీవల కలిసినప్పుడు అతడు ఒకమాట చెప్పాడు. 'నాకు గతంలో ఎంత కోపం ఉండేదో నీకు తెలుసు. నేను తర్వాత కాలంలో దాన్ని వదిలేశాను. నువ్వెందుకు వదల్లేకపోతున్నావు. పుస్తకాలు చదవడం కాదు.. అందులోని సారాంశాన్ని అర్థం చేసుకొని కోపాన్ని వదిలెయ్' అని సలహా ఇచ్చాడు' అని మోహన్‌బాబు గుర్తుచేసుకున్నారు. రజనీ హైదరాబాద్ వచ్చిన ప్రతిసారీ మోహన్‌బాబుని కలుస్తుంటారు. ఈవిషయాన్ని సందర్భం వచ్చినప్పుడల్లా ఇద్దరూ వెల్లడిస్తూనే ఉంటారు.



Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656